ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా గుగులోతు హుస్సేన్ నాయక్



3లో

PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది




3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 334 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 27 నవంబర్ 2025

## 28న అమరావతికి నిర్మలా సీతారామన్

- పలు నూతన భవనాలకు శంకుస్థాపన



2లో

## హాంగ్‌కాంగ్‌లోని భారీ అగ్నిప్రమాదం

- 35 అంతస్తుల భవనంలో మంటలు
- 13 మంది దుర్మరణం



2లో



## గ్రామాలకు పల్లెపండుగ 2.0

- రూ. 6787 కోట్లతో అభివృద్ధి
- ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్

**అమరావతి,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** 'రాష్ట్రంలోని గ్రామాల ముఖచిత్రాన్ని సంపూర్ణంగా మార్చివేసే లక్ష్యంతో 'పల్లె పండగ 2.0' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామ'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా 4 వేల కిలోమీటర్లు రోడ్లు నిర్మించినట్లే, పల్లె పండగ 2.0లో రెండింతల అభివృద్ధికి శ్రీకారం మిగతా2లో...

# నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణాలా?

- విచ్చలవిడిగా మద్యం దుకాణాల ఏర్పాటు
- ఇలాగైతే రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుంది
- తెలంగాణ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు






**హైదరాబాద్,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే తెలంగాణ రాష్ట్రానికి కొత్త పేరు పెట్టాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేసింది. నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సత్యనారాయణ కాలనీలో నివాసాల మధ్య కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. మద్యం దుకాణాల నియంత్రణపై తమకు పూర్తి అధికారాలు లేనప్పటికీ, ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకునే వరకు తాము ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది. కనీసం రహదారిపైకి మిగతా2లో...




## నేటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లు

- ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దిశానిర్దేశం
- ఎన్నికలు సజావుగా నిర్వహించాలని సూచన

**హైదరాబాద్,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఆమె సూచించారు. కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా మిగతా2లో...

## దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అడుగులు

- అరుదైన ఖనిజాల కోసం ప్రత్యేక చర్యలు
- 19,919 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం
- రెండు కీలక రైల్వే ప్రాజెక్టులకూ గ్రీన్ సిగ్నల్
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ, 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా కేంద్ర కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ ఒకేసారి నాలుగు ప్రధాన నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశంలో అరుదైన-భూమి అయస్కాంతాల దేశీయ ఉత్పత్తిని మిగతా2లో...



# అవినీతి అనకొండ సిఎం రేవంత్

- ముని్సపాలిటీల విలీనం దారుణం
- మండిపడ్డ మాజీ మంత్రి కెటిఆర్

**వరంగల్,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆయన అన్నద మ్ములు, అనుయాయులతో కలిసి ఓ అవినీతి అనకొండ మాదిరిగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన హెచ్ఐఎల్‌టీపీ పాలసీపై ఆయన నిప్పులు చెరిగారు. పరిసర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనపై తీవ్రంగా స్పందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 'మాజీ సీఎం కేసీఆర్ హయాంలో పది జిల్లాల తెలంగాణను 33 జిల్లాలుగా మార్చడం జరిగింది. అదే విధంగా కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త పురపాలికలు ఏర్పాటు చేశారు. తాండాలను అప్‌గ్రేడ్ చేసి 8,800 గ్రామ పంచాయతీలను 12,800కు పెంచడం జరిగింది. మిగతా2లో...

## ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణం

- హాజరైన మంత్రులు, ప్రముఖులు



2లో

## జీఎంఆర్ ఏరోపార్క్‌లో సఫ్రాన్ సెంటర్

- వర్చువల్‌గా ప్రారంభించిన మోడీ
- అభినందనలు తెలియచేసిన సిఎం రేవంత్



**హైదరాబాద్, 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణపై నమ్మకంతో హైదరాబాద్‌ను ఎంచుకున్న సఫ్రాన్‌కు సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. శంషాబాద్ సమీపంలోని జీఎంఆర్ ఏరోపార్క్ లో ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ సంస్థ సఫ్రాన్ నెలకొల్పుతున్న సెంటర్‌ను బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ఆన్ లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కొత్త సదుపాయం ఏరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ వృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఇది భారతదేశంలో LEAP ఇంజిన్‌ల మొట్ట మొదటి మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్ (MRO)సెంటర్ అని తెలిపారు. రూ. 1,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ స్థానిక ఎంఎస్ఎంఈలకు, ఇంజనీరింగ్ కంపెనీలకు కొత్త వ్యాపార అవకాశాలను మిగతా2లో...

## వాయుగుండంగా మారిన తీవ్ర అల్పపీడనం

- పశ్చిమ వాయువ్య దిశగా పయనం
- తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్ష సూచన



2లో

## కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా...

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** అధికార కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెలను గ్రామాల్లో కూల్చివేయాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అంశంపై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో..అన్ రిజర్వుడు స్థానాల్లో అన్ని చోట్లా నామినేషన్లు వేయాలని బీసీలకు ఆమె సూచించారు. 42 శాతం రిజర్వేషన్లలో ప్రధాన దోషి బీజేపీ అని ఆరోపించారు. మిగతా2లో...

# గ్రామాలకు పల్లెపండుగ 2.0

(మొదటి పేజీ తరువాయి)

చుట్టినట్లు వెల్లడించారు. పల్లె పండగ 2.0 కార్యక్రమం ద్వారా 13,326 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.6,787 కోట్ల వ్యయంతో 53,382 అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం శివకోడులో పల్లె పండగ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. బహిరంగసభలో మాట్లాడారు. పల్లె పండగ విజయం ఇచ్చిన స్ఫూర్తిని కొనసాగిస్తూ పల్లె పండగ 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పవన్ తెలిపారు. పల్లె పండగ 1.0 కార్యక్రమం ద్వారా రూ. 2,525 కోట్ల విలువైన పనులు టైం బౌండ్ విధానంలో పూర్తి చేశాం. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాం. పాడి రైతుల కోసం 22,500 మినీ గోకులాలు ఏర్పాటు చేశాం. మూగజీవాల దప్పిక తీర్చడానికి 15 వేల నీటి తొట్టెలు నిర్మించాం. లక్షకు పైగా నీటి కుంటలు ఏర్పాటు చేశాం. ఇప్పుడు పల్లె పండగ 2.0 కార్యక్రమం ద్వారా రూ. 5,838 కోట్ల అంచనా వ్యయంతో 8,571 కిలో మీటర్ల కొత్త రహదారులు నిర్మిస్తున్నామని తెలిపారు. పాత రహదారులకు పునర్నిర్మాణం చేయబోతున్నాం. రూ. 375 కోట్ల వ్యయంతో 25 వేల మినీ గోకులాలు, రూ. 16 కోట్ల అంచనాతో 157 కమ్యూనిటీ గోకులాలు ఏర్పాటు చేస్తాం. రూ. 4 కోట్ల వ్యయంతో 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశాం. పంచాయతీల పరిధిలో రూ. 406 కోట్లతో 15 వేల కొత్త అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. రూ.148 కోట్లతో డీపీఆర్సీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం చేయనున్నాం. వీటితోపాటు కోనసీమకు అదనంగా మరో రూ.100 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనను ఒకసారి గుర్తు చేసుకుంటే గుంతలుపడ్డ రోడ్లు, మరమ్మతులు నోచుకోని కాలువలు, పాలనపై ప్రశ్నిస్తే పెట్టిన అక్రమ కేసులు గుర్తుకొస్తాయి. గత ప్రభుత్వం నుంచి మన ప్రభుత్వానికి వారసత్వంగా ఏదైనా వచ్చింది అంటే అవి అప్పులు, సమస్యలు మాత్రమే. గత ప్రభుత్వ హయాంలో నాయకుల దగ్గరకు వెళ్లి ఇది చేయండి అని అడిగే పరిస్థితి ఉండేది కాదు. మార్పు కావాలని యువత బలంగా తీసుకున్న నిర్ణయంతో ఈ రోజు ప్రభుత్వం మారిపోయింది. అభివృద్ధి పనులకు వేల కోట్లు ఖర్చు చేయగలుగుతున్నామని గుర్తుచేశారు.గత ప్రభుత్వంలా మేము దోచుకోవడం లేదు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం లేదు. సంక్షేమం పేరుతో అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడం లేదు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇస్తున్నాం. అభివృద్ధికి వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. పెన్షన్లు మీకంటే బలంగా ఇస్తున్నాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక తరహాలో ఇక్కడ విప్లవాలు వస్తాయని కొంతమంది నాయకులు కలలు కంటున్నారు. గత ప్రభుత్వం ఇంకో ఏడాది అధికారంలో ఉంటే అలాగే జరిగేది. కానీ అదృష్టవశాత్తు ఎలాంటి గొడవలు లేకుండానే ఓటు అనే ఆయుధంతో యువత ప్రభుత్వాన్నే మార్చేశారని అన్నారు.

# దేశ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించడం అత్యంత ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది మోదీ సర్కార్. అలాగే మహారాష్ట్ర-గుజరాత్ ప్రజలకు ప్రత్యేక బహుమతులు సహా మొత్తం రూ. 19,919 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ నిర్ణయాలను ప్రకటించారు. అరుదైన భూమి అయస్కాంతాలతో పాటు, ప్రభుత్వం రెండు కీలక రైల్వే ప్రాజెక్టులను కూడా ఆమోదించింది. ముంబై సమీపంలోని బద్లాపూర్-కర్జాత్ లైన్, గుజరాత్‌లోని ద్వారకా లైన్ లకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు దేశవ్యాప్తంగా కనెక్టివిటీ గురించి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. ఈ ప్రాజెక్టులు లక్షలాది మంది ప్రయాణికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తాయి. ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. అత్యధిక బడ్జెట్ కలిగిన పూణే మెట్రోకు కేంద్రం రూ. 9,858 కోట్లు గ్రాంట్‌ను అందించనున్నారు. 32 కిలోమీటర్ల కొత్త లైన్ వేయడానికి వీలు కల్పించింది కేంద్రం.ఈ మార్గం ఖరడి నుండి ఖడక్వాస్లా వరకు, నల్ స్టాప్ నుండి మాణిక్ బాగ్ వరకు నడుస్తుంది. ఇది పూణే మెట్రో నెట్‌వర్క్‌ను 100 కిలోమీటర్లకు పైగా విస్తరిస్తుంది. ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బంది పడుతున్న పూణే నివాసితులకు ఇది ఒక పెద్ద ఉపశమనం. భవిష్యత్ సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం అరుదైన భూమి శాశ్వత మాగ్నెట్ పథకాన్ని ఆమోదించింది. దీని కోసం రూ. 7,280 కోట్ల బడ్జెట్ కేటాయించింది. భారతదేశంలో హైటెక్ మాగ్నెట్లను తయారు చేయడమే దీని లక్ష్యం. ఈ మాగ్నెట్లను ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లలో ఉపయోగిస్తారు. ఈ కొత్త ప్రణాళిక భారతదేశంలో అరుదైన-భూమి అయస్కాంతాల ఉత్పత్తికి పూర్తి దేశీయ పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తుంది. ప్రస్తుతం, ఈ రంగంలో మనం ఇతర దేశాలపై ఆధారపడుతున్నాము. 159 కిలోమీటర్ల పొడవైన ఈ లైన్ దేవభూమి ద్వారకకు ప్రయాణించే రైళ్ల సంఖ్యను పెంచుతుంది. ఈ లైన్‌ను రెట్టింపు చేయడం వల్ల సరుకు రవాణా రైళ్లు వేగంగా నడపడానికి వీలు కలుగుతుంది. ఇది ఈ ప్రాంత అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఈ నాలుగు నిర్ణయాల కోసం ప్రభుత్వం మొత్తం రూ. 19,919 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇది ఒకే రోజులో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయం. ఇది రైల్వే, మెట్రో ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకుంది కేంద్రం. రేర్ ఎర్త్ పథకం దేశ సాంకేతికతకు కొత్త దిశానిర్దేశం చేస్తుంది. ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తవుతాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.


# అవినీతి అనకొండ సిఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

అధికారాన్ని వికేంద్రీకరించి, ప్రభుత్వాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నం చేసింది' అన్నారు.'ఈ విషయంలో ప్రభుత్వం ఎవరితో చర్చించిందో తెలియదు. ఎందుకంటే, మున్సిపాలిటీల్లో ఎలాంటి తీర్మానాలు జరగలేదు. ఏ ఒక్క మున్సిపాలిటీ నుంచి కూడా కనీసం తీర్మానం తీసుకోలేదు. మున్సిపాలిటీలు కొలువు తీరి లేవు కాబట్టి ప్రజలతో నేరుగా అభిప్రాయ సేకరణ చేశారా ? అంటే అదీ చేయలేదు. అఖిలపక్ష సమావేశం పెట్టి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకున్నారా ? శాసనసభ పెట్టి సభ్యుల అభిప్రాయం తీసుకున్నారా అంటే అదీ లేదు. మరి ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరి ఎజెండా కోసం, ఎవరి శాశ్వత దీర్ఘకాలిక ఆలోచనల కోసం ఈ ప్రభుత్వం పనిచేస్తుందో మాకైతే తెలియడం లేదు. ఏ కారణం చేత ఈ ప్రతిపాదనను తెచ్చారో కూడా స్పష్టంగా లేదు. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, దళారుల ప్రయోజనాల కోసం మాత్రమే ఈ ప్రభుత్వం పనిచేస్తు న్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది' అన్నారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ పేరుతో కొత్త పాలసీని తీసుకు వచ్చారు. పరిశ్రమలకు కేటాయి ంచిన భూములు అపార్ట్‌మెంట్లకు ఇస్తున్నారు. గతంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు ప్రజలను ఒప్పించి, ఉపాధి అవకాశాల కోసం భూములను సేకరించిన తీరుగానే, గత ప్రభుత్వాలు హైదరాబాద్ నగరంలో 9,300 ఎకరాల భూమిని పరిశ్రమలకు కేటాయిం చాయి. కానీ, ప్రస్తుతం ఆ భూముల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకి భూములు తీసుకొని, వారికి తక్కువ ధర ఇచ్చి, సబ్సిడీపై పరిశ్రమలకు భూము లిచ్చిన తర్వాత పరిశ్రమలు నడవాలి. ఉపాధి దొరకా లి. యువతకు ఉద్యోగాలు రావాలి. రాష్ట్ర ఆదాయం పెరగాలని మేము ఆశిస్తున్నాం. రేవంత్ రెడ్డి గారి వైఖరి ఇందుకు విరుద్ధంగా ఉంది. హైదరా బాద్‌లోని పరిశ్రమల యజమానులు వచ్చి, అపార్ట్ మెంట్లు కట్టుకుంటాం, మాల్స్ కట్టుకుంటాం అంటే.. వారికి అడ్డికి పావుశేరు చొప్పున మార్కెట్ రిజిస్ట్రేషన్ ధరకు కాకుండా కేవలం ప్రభుత్వ రిజిస్ట్రేషన్ వాల్యూలో 30శాతం మాత్రమే చెల్లించి, భూమిని కన్వర్ట్ చేసుకో వడానికి రేవంత్ రెడ్డి అనుమతిస్తున్నాడు' అని ఆరోపిం చారు. 'హైదరాబాద్, వరంగల్ లాంటి నగరాల్లో పార్కులకు, పార్కింగ్‌లకు, బొందలగడ్డలకు, ఇల్లు కట్టుకోవడానికి జాగా లేదు. వీటికి జాగాలు వద్దట. కానీ, పారిశ్రామికవేత్తలు అడ్డికి పావుశేరుకు కొనుక్కున్న, ప్రభుత్వం ఇచ్చిన భూములను వారు ఇష్టం వచ్చినట్లు అమ్ముకుంటే మాత్రం రేవంత్ రెడ్డి పచ్చజెండా ఊపుతున్నారు. 9,300 ఎకరాల భూమి దాదాపు రూ.5లక్షల కోట్ల విలువైన ఆస్తి. దేశంలోని ఇతర రాష్ట్రాలు (ఉదాహరణకు ముంబయి) మిల్స్ కోసం ఇచ్చిన భూములను 50శాతం వెనక్కి తీసుకొని, ప్రజల అవసరాల కోసం వినియోగిస్తున్నాయి. రేవంత్ రెడ్డి 'అవినీతి అనకొండ' అని.. రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ములు, ఆయన అనుయాయులతో కలిసి ఒక అవినీతి అనకొండ మాదిరిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆ అవినీతి అనకొండ విశ్వరూపం ఏమి టంటే.. రూ.5 లక్షల కోట్లు విలువైన తెలంగాణ ప్రజల ఆస్తిని దోచుకుపోవడానికి, ఉద్దేశపూర్వకంగా గత ప్రభుత్వాలు పరిశ్రమలకు ఇచ్చిన భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు' అంటూ ధ్వజమెత్తారు.

# వాయుగుండంగా మారిన తీవ్ర అల్పపీడనం

- పశ్చిమ వాయువ్య దిశగా పయనం
- తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్ష సూచన



**హైదరాబాద్,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారింది. రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశలో కదిలి మరింతగా బలపడనుంది. మధ్య బంగాళాఖాతానికి చేరే క్రమంలో బలహీనపడనుంది. అటు బుధ, గురువారాల్లో వాయుగుండం దిశపై మరింత స్పష్టత లభించే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే శ్రీలంక-నైరుతి బంగాళాఖాతం పరిసరాల్లో మరొక అల్పపీడనం ఏర్పడింది. బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. తర్వాతి 24 గంటల్లో ఇది కూడా వాయుగుండంగా బలపడే ఛాన్స్ ఉందన్నారు. రెండు వాయుగుండాలు ఉత్తర తమిళనాడు తీరం దిశగా కదలనున్నాయని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత కోస్తాంధ్ర వైపునకు చేరుకుని బలహీనపడనున్నాయి. నవంబర్ 30, డిసెంబర్ 1న తెలంగాణలో అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.మరోవైపు వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో చలి తగ్గింది. మెదక్‌లో 13.8 డిగ్రీలు, పటాన్ చెరువులో 14.4 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 14.7 డిగ్రీలు, హయత్ నగర్‌లో 15 డిగ్రీలు, రాజేంద్రనగర్‌లో 17 డిగ్రీలు, హనుమకొండలో 17.5 డిగ్రీలు, రామగుండంలో 17.5 డిగ్రీలు, నిజామాబాద్‌లో 17.6 డిగ్రీలు, దుండిగల్‌లో 17.7 డిగ్రీలు, నల్లగొండలో 18.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 18.2 డిగ్రీలు, హకింపేట్‌లో 18.7 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 19.1 డిగ్రీలు, ఖమ్మంలో 20.4 డిగ్రీలు, భద్రాచలంలో 20.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఏపీపై కూడా వాయుగుండం ప్రభావం పడనుంది. రేపటి నుంచి మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్లరాదని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. సముద్రంలో వేటకు వెళ్లినవారు వెంటనే తిరిగి ఒడ్డుకి రావాలని సూచించింది. వాతావరణ ప్రభావంతో నవంబర్ 29 - డిసెంబర్ 2 వరకు కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురుస్తాయంది. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలంది.

# కాంగ్రెస్ పార్టీపై యుద్ధం చేస్తే తప్పా...

(మొదటి పేజీ తరువాయి)

బీసీలకు మోసం జరుగుతుంటే..ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి రియాక్షన్ లేదని విమర్శించారు. ప్రతిపక్షం గురించి తాను మాట్లాడనని.. మాట్లాడితే బద్నాం చేస్తారన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పోరాటం చేసిందేమీ లేదని కుండ బద్దలు కొట్టారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సరిగ్గా జరగలేదన్నారు. అందుకే బీసీలకు రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరిగిందని తెలిపారు. మంత్రులు,ఎమ్మెల్యేల ప్రమేయంతోనే ఈ రిజర్వేషన్లు ఖరారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని స్వయంగా జిల్లా కలెక్టర్లే చెబుతున్నారన్నారు. బీసీ జనాభాను కావాలని కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ చేసి చూపిందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా 5 శాతానికి పైగా బీసీ జనాభా తగ్గించి చూపించారని చెప్పారు.21శాతం మాత్రమే బీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. పంచాయతీ ఎన్నికలతో జనం బాట కార్యక్రమంలో స్వల్ప మార్పులు చేశామని చెప్పారు. పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు గ్రేటర్ పరిధిలో జనం బాట కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. తనపై బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డి ఎందుకు స్పందిస్తున్నారో అర్థం కాలేదన్నారు.ఏదైనా ఆరోపణలు చేస్తే.. అర్థం పర్థం ఉండాలని పేర్కొన్నారు. తాను ఎవరిపైనో ఆరోపణలు చేస్తే.. మహేశ్వరరెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. తన ఆరోపణలపై స్పందించి.. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మంచి ఒరవడికి శ్రీకారం చుట్టారని అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆక్రమించిన భూమి తనకెందుకని ప్రశ్నించారు. ఆ భూమిని ప్రజలకు ఇస్తే సరిపోతుందని కవిత తెలిపారు.

# 28న అమరావతికి నిర్మలా సీతారామన్

**అమరావతి,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్)::** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు.. వివిధ సంస్థల ఆఫీసులు కూడా రెడీ అవుతున్నాయి.. ఇక, ఆర్బీఐ సహా పలు జాతీయ, ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా అమరావతిలో రానున్న రోజుల్లో తమ కార్యకలాపాల నిర్వహణ కోసం సిద్ధం అవుతున్నాయి.. వాటికి అనుగుణంగా ఇప్పుడు కొత్త భవనాలను నిర్మించనున్నారు.. 28న రాజధాని అమరావతిలో పర్యటించనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. రాజధాని అమరావతిలో ఆర్‌బిఐ సహా 25 జాతీయ, ప్రయివేట్, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లకు సంబంధించిన నూతన భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు.. అన్ని బ్యాంకులకు ఒకేసారి శంకుస్థాపన చేయనున్నారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్..ఇక, నిర్మలా సీతారామన్ పర్యటన నేపథ్యంలో.. CRDA ప్రధాన కార్యాలయం వద్ద సభా వేదిక ఏర్పాటు చేయనున్నారు.. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారాయణ, నారా లోకేష్ హాజరుకానున్నారు. ఇప్పటికే వివిధ బ్యాంకులకు భూ కేటాయింపులు చేసింది జ=ణూ.. బ్యాంకులతో పాటు.. అధికారుల నివాస భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు.. ఇప్పటి వరకు కేవలం ఏపీ ప్రభుత్వం భవనాలు మాత్రమే నిర్మాణం జరుగుతుండగా.. ఇప్పుడు అన్ని ప్రధాన బ్యాంక్ కార్యాలయాల నిర్మాణం ప్రారంభం కాబోతుంది.. ఈ నేపథ్యంలో అమరావతిలో ఆర్థిక కార్యకలాపాలపై దృష్టి పెట్టిన ప్రభుత్వం.. ముందుకు సాగుతోంది.

# హాంగ్‌కాంగ్‌లోని భారీ అగ్ని ప్రమాదం

**హాంగ్‌కాంగ్,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** హాంగ్‌కాంగ్‌లోని 35 అంతస్తుల హౌసింగ్ కాంప్లెక్స్‌లో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో 13 మంది మృతి చెందారు. మరికొందరు మంటల్లో చిక్కుకున్నట్లు సమాచారం. సంఘటన స్థలంలోనే తొమ్మిది మంది మరణించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అగ్ని ప్రమాదం నుంచి బయ టపడిన హౌసింగ్ కాంప్లెక్స్‌లోని వందలాది మందిని తాత్కాలిక ఆశ్రయాలకు తరలించారు. థాయ్ పో జిల్లాలోని ఆకాశహర్మ్యాల్లో బుధవారం మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాప్తి చెంది ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఆ నివాస సముదాయంలో సుమారు 2,000 ఇళ్లు ఉన్నాయని, అందులో కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ఘటనను 4వ నెంబరు ప్రమాదంగా అధికారులు ప్రకటించారు. పరిస్థితి ప్రకటించిన ప్పుడు భారీ స్థాయిలో ఫైరింజన్లు, సిబ్బందిని మోహరించవలసి ఉంటుంది. ఈ నివాస సమదాయంలో దాదాపు 4,800 మంది నివసిస్తున్నారు. 128 అగ్నిమాపక వాహనాలు, 57 అంబులెన్సుల ను ఘట నా స్థలానికి తరలించారు.మంటల్లో చిక్కుకున్నవారిలోవృద్ధులుఅధికంగాఉన్నట్లు అధికారులు తెలిపారు.

# జీఎంఆర్ ఏరోపార్క్‌లో సఫ్రాన్ సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తుందన్నారు. ఇవాళ సఫ్రాన్‌కు చెందిన ఎమ్88 మిలిటరీ ఇంజిన్ ఎమ్ఆర్‌వోకు కూడా శంకుస్థాపన చేసుకున్నామని వెల్లడిం చారు. ఈ ఎమ్ఆర్‌వో భారత వైమానిక దళం, భారత నావికాదళానికి ఎంతో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్.. భారతదేశంలోని ప్రధాన ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్ అని పేర్కొన్నారు. తెలంగాణలో 25 కంటే ఎక్కువ ప్రధాన ప్రపంచ కంపెనీలు, 1,500 కి పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయన్నారు. తమ ప్రగతిశీల పారిశ్రామిక విధానం, ఎమ్ఎస్ఎమ్ఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు ప్రముఖ ప్రపంచ కంపెనీల నుంచి అనేక భారీ పెట్టుబడులను ఆకర్షించాయన్నారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి తెలంగాణ ఏరోస్పేస్ అవార్డును పొందిందని గుర్తు చేశారు. ఏరోస్పేస్ పెట్టుబడులను ఆకర్షించడానికి నైపుణ్యం చాలా ముఖ్యమైన ప్రమాణమని చెప్పుకొచ్చారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో తెలంగాణ 100 ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్‌లను (ఐటీఐఎస్) అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసిందని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ విమానాల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణపై దృష్టి పెడుతోందన్నారు.30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని వెల్లడించారు.

# నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణాలా?

(మొదటి పేజీ తరువాయి)

మద్యం దుకాణాలు కనిపించకుండా ఏర్పాటు చేయాలన్న ఆదేశాలను కూడా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరణ ఇవ్వాలని నాగారం మున్సిపల్, ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు సదరు మద్యం దుకాణం యజమానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# నేటి నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఎన్నికల నియామావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆమె అన్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియతో పాటు భద్రత, పోలింగ్ ఏర్పాట్లపై చర్చించారు. అదనపు డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్ డైరెక్టర్ సృజన తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్ ప్రమాణం



**హైదరాబాద్,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో ప్రస్తుతం సర్పంచ్ ఎన్నికల హడావిడి మొదలైంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు రిజర్వేషన్ ల అంశం మీద వాయిదా పడ్డ ఎన్నికల నోటిఫికేషన్ ను ఎట్టకేలకు తెలంగాణ ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ను విడుదల చేసింది. మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశ డిసెంబర్ 11 న పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆ తర్వాత డిసెంబర్ 14, మూడో దశలో డిసెంబర్ 17న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు జరిగిన రోజు మధ్యాహ్నం తర్వాత ఎన్నికల అధికారులు రిజల్ట్ ను ప్రకటిస్తారు.మరోవైపు సర్పంచ్ ఎన్నికలపై ఇప్పటికే కేటీఆర్ కాంగ్రెస్ పై పంచ్ లు వేశారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందంటూ ట్విట్ చేశారు. మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో సర్పంచ్ ఎన్నికలపై కూడా అన్ని పార్టీలు ఫోకస్ పెట్టాయి. మరోవైపు ఇటీవల జూబ్లిహిల్స్ బై పోల్స్ లో 25 వేల భారీ మెజార్టీతో గెలిచిన నవీన్ యాదవ్ ఈ రోజు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. అదే విధంగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ నవీన్ యావత్ తో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమంకు మంత్రులు శ్రీధర్ బాబు, అజరుద్దీన్ తో పాటు డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, వీహెచ్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుపొందారు. ఎన్నికల అధికారులు నవీన్ యాదవ్ గెలుపుని అధికారికంగా ప్రకటించారు. మరోవైపు.. తనపై ఎంత చెడుగా ప్రచారం చేసిన కూడా భారీ మెజార్టీతో గెలపించిన ప్రజలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. జూబ్లిహిల్స్ నియోజక వర్గంను రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతానని నవీన్ యాదవ్ చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పటికే నవీన్ యాదవ్ ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ పెద్దల ఆశీర్వాదం కూడా తీసుకున్నారు.

# రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది










## • వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అధ్యక్షులు వలుస సుధీర్

**హనుమకొండ,న్యాయవిభాగం నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాజ్యాంగ దినోత్సవాన్ని వరంగల్ బార్ అసోసియేషన్‌లో ఘనంగా నిర్వహిం చింది. 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని వరంగల్ బార్ అసోసియేషన్ హాల్ (అంబేద్కర్ హాల్)లో ఘనంగా నిర్వహించారు.సభకు అధ్యక్షత వహించిన వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని తెలుపుతూ మన రాజ్యాంగాన్ని కుల మతాలకు అతీతంగా ప్రతి భారతీయుడు గౌరవిస్తూ ఆ ఆశయాల వెలుగులో నడవాలని చెబుతూ మన రాజ్యాంగం మూడు శాశ్వత పునాదులపై నిలబడి ఉందన్నారు. స్వేచ్ఛ ,సమానత్వం ,సోదరభావం ఈ విలువలు మనకు హక్కులు మాత్రమే కాదు, బాధ్యతలు కూడా అప్పగిస్తాయంటూన్యాయవాదులుగా మన పాత్ర మరింత ముఖ్యమైనది,హక్కులను రక్షించడం, న్యాయాన్ని నిలబెట్టడం, సమాజాన్ని చైతన్యపరచడం మన వృత్తి మాత్రమే కాదు, మన ధర్మం కూడా అని అన్నారు.రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకోవడం మనందరికీ స్ఫూర్తిదాయకం అంటూ వారి ఆశయాల వెలుగులో ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతతో ముందుకు సాగి అసమానతలు లేని సమాజాన్ని సాధించాలని పాలకులు రాజ్యాంగంపై గౌరవముంచి వ్యక్తిగత ఎజెండాకు తావులేకుండా,నిరంకుశత్వానికి పాల్పడకుండా రాజ్యాంగం సూచించిన పంథాలో ప్రజాస్వామ్యయుతంగా పాలన సాగించాలని బార్ అసోసియేషన్ తరపున పిలుపునిచ్చారుఈ రాజ్యాంగ దినోత్సవ న్యాయవాదులు రాజ్యాంగ నిర్మాత బి ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు మైదం జయపాల్, ప్రధాన కార్యదర్శి డి. రమాకాంత్, సంయుక్త కార్యదర్శి రేవూరి శశిరేఖ ,కోశాధికారి సిరుమళ్ల అరుణ, సీనియర్ ఈసి ఇజ్జేగిరి సురేష్, మహిళా సీనియర్ ఈసి కలకోట నిర్మల జ్యోతి,ఈసి సభ్యుడు మర్రి రాజు , తెలంగాణ రాష్ట్రబార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, సీనియర్ న్యాయవాదులు తీగల జీవన్ గౌడ్, వి వెంకట రత్నం, సాయిని నరేందర్, జెన్ను పద్మ,మధుకర్ ప్రసంగించినారు మరియు ఇతర పలువురు న్యాయవాదులు సభలో పాల్గొని నివాళులర్పించారు.

---

# తొర్రూర్ ఆర్టీసీ బస్టాండ్ నుండి పాలకుర్తికి నూతన బస్సు సర్వీస్ త్వరలో ప్రారంభం





## • తోరూర్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ పద్మావతి వెల్లడి

**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 26(పిసీడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి లో గల టి జి ఎస్ ఆర్ టి సి బస్టాండ్ ను అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను గతంలో కలిసి బస్టాండ్ అభివృద్ధి చేసేందుకు మీ వంతు కృషి చేయాలని కోరారు. పాలకుర్తి నియోజకవర్గం లో తొర్రూరు బస్ డిపో ఉన్నప్పటికీ పాలకుర్తి దేవస్థానం వెళ్లేందుకు భక్తులకు సరైన సౌకర్యాలు లేవని ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తొర్రూరు బస్టాండ్ నుండి పాలకుర్తి బస్టాండ్ కి వెళ్లేందుకు ఉదయం 2 బస్సులు, పగలు 1 బస్సు హైదరాబాద్ కు వెళ్లేందుకే ఉండటం వలన పాలకుర్తి కి వెళ్ళిన ప్రయాణికులు తిరిగి రావాలి అనుకుంటే ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని ఈ విషయాన్ని దయల్ యువర్ డిఎం కార్యక్రమంలో పలువురు ప్రయాణికులు డిపో మేనేజర్ పద్మావతిని కోరామని అన్నారు. అనుకూలంగా స్పందించిన డి ఎం తోరూర్ నుండి పాలకుర్తి కి వెళ్లేందుకు త్వరలో నూతన బస్సు సర్వీసును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పాలకుర్తి కి వెళ్లే ప్రయాణికులు ఈ బస్ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. త్వరలో పాలకుర్తికి తొర్రూరు నుండి ఆర్టీసీ బస్సు ప్రారంభించనున్న సమయ వేళలను గమనించండి. తొర్రూర్ నుండి పాలకుర్తి వైపు వెళ్లే బస్సు ఉదయం 7:15 నిమిషాలకు, 9:40 నిమిషాలకు, పగలు 12 :15 నిమిషాలకు, తిరిగి 2: 40 నిమిషాలకు, సాయంత్రం 5:15 నిమిషాలకు తొర్రూరు బస్టాండ్ నుండి బయలుదేరు సమయం ఇవి. తిరుగు ప్రయాణంలో పాలకుర్తి బస్టాండ్ నుండి తొర్రూర్ రావడానికి ఉదయం 8:50 నిమిషాలకు, 10: 50 నిమిషాలకు, పగలు 1:30,3'50, సాయంత్రం 6:30 నిమిషాలకు చివరి బస్సు, పాలకుర్తిలో ఎమ్మెల్యే ను కలిసి ఎందుకు అలాగే సోమేశ్వర దేవాలయాన్ని సందర్శించుకునేందుకు ఈ బస్సు అందరికీ ఉపయోగపడుతుంది. బస్సును సద్వినియోగం చేసుకోండి.

---

# నాణ్యతను పాటించి వినియోగదారుల మన్ననలు పొందాలి





**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**

**సిరి జ్యుయెలరీ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే**

**పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎమ్మెల్యే విస్తృత పర్యటన**

**సత్తుపల్లి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నాణ్యతను పాటించి వినియోగదారుల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. బుధవారం పట్టణంలో బాలాజీ దియెటర్ ఎదురుగ నూతనముగా ఏర్పాటు చేసిన 'సిరి జ్యుయాలరీస్' షాప్ ను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాణ్యతకు మారుపేరుగా సిరి జ్యుయాలరీస్ పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని అన్నారు. అదేవిధంగా బుగ్గపాడు గ్రామం నాగేంద్రస్వామి గుడిలో పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వి.యం బంజర్ గ్రామంలో శ్రీ మహాలక్ష్మి 1 గ్రామ్ గోల్డ్ జ్యుయాలరీ ఫాన్సీ ఐటమ్ నూతన షాప్ ను ప్రారంభించి ప్రజలకు ప్రతి ఫ్యాన్సీ ఐటమ్‌ను అందుబాటులో ఉంచటం అభినందనీయమన్నారు. అనంతరంఆంజనేయ స్వామిగుడిలో అయ్యప్ప స్వాముల విరుముడి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్తుపల్లి పట్టణంలో 23 వ వార్డ్ హైపర్ ప్రక్కన అనారోగ్యంతో బాధపడుతున్న రిటైర్డ్ టీచర్ వాసిరెడ్డి మధుసూదన్ రావును పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివా వేణు, పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, సత్తుపల్లి మాజీ వైస్ చైర్మన్ తోట సుజలారాణి, సీనియర్ నాయకులు కమల్ పాషా, కిసర రాంబాబు, ఏఎంసి వైస్ చైర్మన్ లు, డైరెకర్స్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ ఇందిరమ్మ ఇల్లు

## • కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్





**సత్తుపల్లి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు వస్తుందని రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. మండల పరిధిలో బుధవారం రామగోవిందా పురం గ్రామానికి చెందిన సయ్యద్ బషీర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వేంసూరు మండలలో కుంచపర్తి గ్రామానికి చెందిన బొర్రా కృష్ణయ్య, మహాలక్ష్మి మనుమరాలు వివాహ ప్రధాన కార్యక్రమంలో నూతన వధువును ఆశీర్వదించినారు. అదే గ్రామానికి చెందిన రావి మోహనరావు కుమారుడుని వివాహ కార్యక్రమంలో నూతన వరుడును ఆశీర్వదించారు. అదే విధంగా సత్తుపల్లి పట్టణంలో ఎన్టీఆర్ కాలనీ నందు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నందు సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా స్వామి వారి యొక్క కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సత్తుపల్లి పట్టణంలో మదర్ తెరిసా స్కూల్ రోడ్డు నందు మోరంపూడి స్వర్ణలత ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివా వేణు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా గుగులోతు హుస్సేన్ నాయక్







**హైదరాబాదు, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టిడబ్ల్యూజేయు) రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం హైదరాబాదులోని గిరిజన విద్యుత్ భవన్ లో కోర్ కమిటీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా గుగులోతు హుస్సేన్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గుగులోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర కోశాధికారి గా నన్ను నియమించినందుకు గాను రాష్ట్ర యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఉన్నటువంటి జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని, జర్నలిస్టుల సమస్యలను ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు.

# డిసిసి అధ్యక్షులు ఇనగాలకు ఘన సన్మానం

## • సన్మానించిన కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా కమిటీ



ఇనగాల వెంకట్రాంరెడ్డిని సన్మానించిన బొచ్చు చందర్

**హనుమకొండ,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హనుమకొండ డీసీసీ అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా బుధవారం రోజున కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఇనగాల వెంకట్రాంరెడ్డి ని శాల్వతో ఘనంగా సన్మానించారు. పూలబొకతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోవరంగల్ పశ్చిమ అధ్యక్షుడు తాళ్లపల్లి రాజు, ఉపాధ్యక్షులు గోవిందు మహాభాను, నిట్టి బాలరాజు, జిల్లెల కృష్ణమూర్తి, సముద్రాల సోమయ్య, జనరల్ సెక్రెటరీ తాటికొండ ప్రసాద్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ రాజు, పరకాల మండల అధ్యక్షుడు దుమల కిషోర్, నడుకుడ మండల అధ్యక్షుడు మేకల కుమారస్వామి, పరకాల బ్లాక్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు పల్లె రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పోటీ చేసే అభ్యర్థి నిబంధనలు పాటించాలి

## • నామినేషన్ పత్రాలుపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలి: ఎంపీడీవో చంద్రశేఖర్



**కల్లూరు, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :**
ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ పత్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీడీవో డి చంద్రశేఖర్ బుధవారం పలు విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థి కచ్చితంగా 21 సంవత్సరాలు నిండాలనీసంబధిత ఓటరు లిస్టులో ఓటరు గా నమోదై ఉండాలనీ తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అయితే క్యాస్ట్ సర్టిఫికెట్ జతపరచాలనీ,డిపాజిట్ సొమ్ము కట్టాలనీ అన్నారు. అభ్యర్థులు నేర చరిత్ర, చర, స్థిర ఆస్తులు, విద్యార్హతలతో కూడిన అఫిడవిట్ ఇద్దరు సాక్ష్యాలతో సంతకం పెట్టించి ఇవ్వాలని తెలిపారు.ఎలక్షన్ ఖర్చు చేస్తూన్న వివరాలు డిక్లరేషన్ ఇవ్వాలి. ఏదైతే స్థానం నుంచి పోటి చేస్తున్నారో ఆ స్థానం నుంచి ఓటరు మాత్రమే ప్రతిపాదకుడుగా ఉండాలి. నామినేషన్ పత్రం పార్ట్ వన్ లో ప్రతిపాదకుని సంతకం ఉండాలి. పార్ట్ 2 లో అభ్యర్థి సంతకం ఉండాలి. పార్ట్ 3 లో కూడా అభ్యర్థి సంతకం ఉండాలి. పార్ట్ 4 లో ఆర్వో సంతకం ఉండాలని తెలిపారు. పార్ట్ 5 రిజెక్టెడ్ నామినేషన్ రీజన్స్ లో ఆర్ఓ సంతకం ఉండాలి. పార్ట్ 6 లో అర్ ఓ సంతకం ఉండాలన్నారు. అఫిడవిట్ లో ఇద్దరు సాక్షుల సంతకంతో పాటు అభ్యర్థి సంతకం ఉండా లన్నారు. ఎక్స్పెండిచర్ డిక్లరేషన్‌లో అభ్యర్థి సంతకం ఉండాలి.**నామినేషన్ పత్రంతో జత పరచవల సింది :** ఫామ్ 3స్వీయ ప్రకటన (అఫిడవిట్)అనుబంధం గ్రామపంచాయతీ నుండి డిపాజిట్ అమౌం ట్ నోడ్యూ సర్టిఫికెట్, బ్యాంక్ ఎకౌంట్ జిరాక్స్, ఆధార్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్ జత పరచాలని తెలియజేశారు. ఇట్టి విషయాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి నామినేషన్ పాత్రాన్ని ఇవ్వాలని తెలిపారు.

# పోలీస్ సిబ్బందికి రైన్ కోట్స్,టీ షర్ట్స్ పంపిణీ

## - మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్.



**మహబూబాబాద్ జిల్లా,నవంబర్26(పీసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరిష్ ఈరోజు మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి డీజీపీ కార్యాలయం నుండి వచ్చిన రైన్ కోట్స్, టీ షర్ట్స్ అందించడం జరిగింది. ప్రతీ యేటా కాలానికి అనుగుణంగా పోలీస్ సిబ్బంది విధులు సమర్ధవంతంగా నిర్వహించేలా ఉండటం కోసం రైన్ కోట్స్, స్వీటర్స్,బ్లాంకెట్స్ టీషీర్స్ డీజీపీ ఆఫీస్ నుండి కేటాయించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం లో డిఎస్పీ శ్రీనివాస్, డిఎస్పీ విజయ్ ప్రతాప్, ఆర్.ఐ భాస్కర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ వావిలాల పల్లిలో ప్రత్యక్షమైన నక్క...





**కరీంనగర్ టౌన్ నవంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం వావిలాల పల్లిలోని శక్తి సోలార్ ఏక వేణి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్యాలయంలో బుధవారం రోజున నక్క ప్రత్యక్షమైంది. కంపెనీ కరీంనగర్ నిర్వాహకులు కటకం సునీల్ రావు ఉదయం కార్యాలయ భవనానికి వెళ్లిన సందర్భంలో అక్కడే ఉన్న పూల కుండీల వద్ద నక్క కనిపించింది. దీంతో వెంటనే సునీల్ రావు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. నక్కను చూడడానికి చుట్టుపక్కల ప్రజలు భారీ ఎత్తున తరలి రావడంతో ఆ నక్క అక్కడినుండి తప్పించుకో పోవడానికి పరుగులు పెట్టింది. అటవీ అధికారులు ఆ నక్క కోసం వెతుకులాట ప్రారంభించారు.

# శక్తి డైరీ పార్లర్ ప్రారంభం




**హనుమకొండ,నవంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ హనుమాన్ నగర్ డబ్బాలు సమీపంలో నూతనంగా శక్తి డైరీ పార్లర్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి డైరీ ఏజీఎం సాగర్ రావు, ఏ ఎస్ ఎం కుమార్ లు పాల్గొని మానస మిల్క్ పార్లర్ ను ప్రారంభించారు. ఇక్కడి ఏరియా వాసులకు నాణ్యమైన శక్తి డైరీ పాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు. డైరీ ఎగ్జిక్యూటివ్ లు మనోజ్, నవీన్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన పార్లర్ ప్రారంభించిన సారబోయిన సతీష్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యుత్ శాఖ ఏఈ బాధ్యతలు స్వీకరణ



**కల్లూరు, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్)** :కల్లూరు పట్టణ విద్యుత్ శాఖ ఏఈ గా మహేంద్ర బుధవారం పదవి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల విషయంలో ప్రజల విషయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనిచేయడం జరుగు తుందని అన్నారు. ప్రజలు ఏ విషయంలో అయినా ఇబ్బందులు ఉన్నప్పుడు తమ దృష్టికి నేరుగా తీసుకొని రావాలని కోరారు.ఇప్పటివరకు పని చేసిన ఏ ఈ బదిలీపై వెళ్లడం జరిగింది.ఈ సందర్భంగా నూతనముగా బాధ్యతలు చేపట్టిన ఏఈ ని సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# దేశాన్ని పాలిస్తున్న బిజెపి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతోంది...

## - రాజ్యాంగం ద్వారానే దేశ ప్రజలకు స్వేచ్ఛ, సమాన హక్కులు దక్కాయి.

## - ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్.





**కరీంనగర్,నవంబర్26(పీసీడబ్ల్యూ న్యూస్):** దేశాన్ని పాలిస్తున్న బిజెపి పార్టీ పౌరుల హక్కులను కాలరాస్తూ రాజ్యాంగాన్ని సైతం తుంగలో తొక్కుతోందని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని కోర్టు చౌరస్తాలో గులాం అహ్మద్ హుస్సేన్ హాజరై పలువురు ఎంఐఎం నేతలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ మాట్లాడుతూ నవంబర్ 26న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించి భారతదేశానికి అంకితం చేసి అమలు చేసిన రోజని చెప్పారు. ఈ దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, శాంతి, సౌభ్రాతృత్వంతో పాటు దేశ ప్రజలకు హక్కులు కల్పించే ఉద్దేశంతో రాజ్యాంగాన్ని ప్రవేశ పెట్టారని గుర్తుచేశారు. దీని వెనుక వారికి ఉన్న ఆలోచన విధానాన్ని గౌరవిస్తూ అంతటి మేధావులు భారతదేశంలో పుట్టడం పట్ల మనమంతా గర్వపడాలని, భవిష్యత్ తరాలకు భారత రాజ్యాంగ విలువలను దాని గొప్పదనాన్ని చాటి చెప్పవలసిన అవసరం ఉన్నప్పటికీ, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని అనగదొక్కే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఒక సందర్భంలో పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్ ను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన విష సంస్కృతి బిజెపి నేతలకే దక్కుతుందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుని పై ఉందన్నారు. పార్లమెంటు వేదికగా అంబేద్కర్ రాజకీయ వారసత్వాన్ని పునికి పుచ్చుకున్న నేతగా బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ జై భీమ్.. జై భీమ్ అనే నినాదాన్ని చేశారని చెప్పారు. ఆర్ఎస్ఎస్ కు వ్యతిరేకంగా ఆనాడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సమతా సైనిక్ దళ్ ను ఏర్పాటు చేశారని, ప్రతి ఏటా సమతా సైనిక్ దళ్ కార్యకర్తలు భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకుడు అన్నేమల్ల సురేష్, అరుణ్ కుమార్, భూమయ్య, హరీశ్, గజ్జెల రవీందర్, దళిత నాయకులు పాల్గొన్నారు.

# కరీంనగర్ ప్రజల సమస్యలపై త్వరలో నగర పాలక సంస్థ కార్యాలయం ముట్టడి


## బీఆర్ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్




**కరీంనగర్ టౌన్ నవంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగర ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, త్వరలోనే నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ప్రజలతో కలిసి ముట్టడించనున్నట్టు బీఆర్ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ప్రకటించారు.నేడు మంకమ్మతోట 37వ డివిజన్ మీకోసం కార్యక్రమంలో భాగంగా నగర బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరీంనగర్ నగరపాలక సంస్థను "నరక పాలక సంస్థ"గా మార్చిందని మండిపడ్డారు.**ప్రజలు రోజూ నరకయాతన పడుతున్నారు: హరిశంకర్ విమర్శ** జనవరిలో పాలకవర్గం ముగిసిన తర్వాత తొమ్మిది నెలల్లో నగర పరిపాలన పూర్తిగా చీకటిమయమైందని ఆయన అన్నారు.వీధి కుక్కలు, కోతుల బెడద, దుమ్ము-ధూళి, చిమ్మచీకటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు."వీధిలోకి రాత్రివేళ ప్రజలు రావాలంటే భయపడే పరిస్థితి. ప్రధాన రోడ్లు ధ్వంసమైపోయినా కనీసం తట్టెడు మట్టీ వేయలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది," అని హరిశంకర్ విమర్శించారు.**సీఎం అస్యూరెన్స్ నిధుల పనులు నిలిచిపోయాయి** బీఆర్ఎస్ హయాంలో కరీంనగర్‌లో 135 కోట్ల రూపాయల విలువైన పనులు ప్రారంభించగా, వాటిలో 65 కోట్ల పనులు టెండర్లు పిలిచి పూర్తి చేశామని తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రూపాయి విలువైన పనీ చేయలేదని ఆరోపించారు.**మున్సిపల్ శాఖ, టౌన్ ప్లానింగ్‌పై తీవ్ర ఆరోపణలు** నగరపాలక సంస్థ ఉద్యోగులు లక్షల్లో జీతాలు తీసుకుంటున్నా పనులు చేయడం లేదని హరిశంకర్ విమర్శించారు.టౌన్ ప్లానింగ్ శాఖ అవినీతి కేంద్రంగా మారిందని, ముడుపులు లేకుండా ఏ ఫైలు కదలదని ఆరోపించారు."వారి అవినీతి ఆధారాలతో బయట పెడతాం," అని హెచ్చరించారు.డోర్ టు డోర్ చెత్త సేకరణ సరైన విధంగా జరగక పోవడం, స్వచ్ఛ ఆటోలు తిరగకపోవడం వల్ల నగరంలో పారిశుధ్యం శూన్యమైందని ఆయన అన్నారు.**మనేరులో నీరు ఉన్నా ప్రతిరోజు సరఫరా చేయలేని దుస్థితి** లోయర్ మానేరు నదిలో 24 టీ ఎంసీల నీరు ఉన్నా నగరానికి ప్రతిరోజు మంచినీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో డెడ్ స్టోరేజీలో నీరు ఉన్నప్పటికీ ప్రతిరోజూ నీళ్లు ఇచ్చామని గుర్తుచేశారు.**త్వరలో నగరపాలక సంస్థ ముట్టడి** అన్ని సమస్యలపై ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంతో రెండు-మూడు రోజుల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహా ముట్టడిని చేపట్టనున్నట్టు తెలిపారు.ముట్టడిలో పార్టీ శ్రేణులతో పాటు నగర ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని తమ హక్కుల కోసం నిలబడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో షౌకత్, బోనకుర్తి సాయి కృష్ణ, నవాజ్, చేతి చంద్రశేఖర్, ఆరె. రవి గౌడ్, ఎడబోయిన శ్రీనివాసరెడ్డి, జెల్లోజీ శ్రీనివాస్, గూడెల్లి రాజ్ కుమార్, నారదాసు వసంతరావు, నాగుల కిరణ్ కుమార్ గౌడ్, ఒడ్నాల రాజు, సత్తినేని శ్రీనివాస్, అనుమల్ల ఉమాశంకర్, మేచినేని పవన్ రావు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు





## రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలు

## నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు

## పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్, జిల్లా కలెక్టర్ లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజలతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీలకు సాధారణ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమీషన్ షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గ్రామానికి అప్ డేట్ చేసిన రిజర్వేషన్లు, ఏ విడత పోలింగ్ ఉంటుంది, పోలింగ్ కేంద్రాల జియో లోకేషన్ వివరాలు వెంటనే టి-పోల్ వెబ్ సైట్, యాప్ లో నమోదు చేయాలని అన్నారు. టి-పోల్ వెబ్ సైట్, ఎన్నికల సందర్భంగా వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో నోడల్ అధికారిని నియమించి ఫిర్యాదులను పరిష్కరించాలని అన్నారు.రెండు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న భవనం దగ్గర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వెబ్ క్యాస్టింగ్ జరిగే పోలింగ్ కేంద్రాల వివరాలు పంపాలని, పోలింగ్ కేంద్రాలలో మంచి వెలుతురు, ఫర్నిచర్, పవర్ సరఫరా వంటి ఏర్పాట్లు చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 27న ఉదయం 10.30 గంటల వరకు విడుదల చేయాలని అన్నారు. నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు పంచాయతీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా అవసరమైన మార్గదర్శకాలను జిల్లా ఎన్నికల అధికారులు జారీ చేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న ప్రింటర్లకు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార కరపత్రాల ముద్రణ చేయవద్దని ఆదేశాలు జారీ చేయాలని, ఎన్నికల ప్రచారం సంబంధించి అభ్యర్థుల వ్యయ వివరాలను నమోదు చేసేందుకు ధరలను ఖరారు చేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ లకు ఎన్నికల కమీషనర్ సూచించారు. ప్రతి మండలానికి ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, ఒక ఏ.ఈ.ఓ. (సహాయ వ్యయ వివరాల నమోదు అధికారి), ప్రతి జిల్లాకు ఒక స్టాటిక్ సర్వేలెన్స్ బృందం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తప్పనిసరిగా జరిగేలా పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి జిల్లాలో ఎం.సి.ఎం.సి. కమిటి, జిల్లా మీడియా సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో వినియోగించే ఎలక్ట్రానిక్ వీడియోలకు ముందుగా ఎం.సి.ఎం.సి. అనుమతి ఉండాలని అన్నారు. ఎన్నికల దృష్ట్యా తనిఖీలు నిర్వహించే సందర్భంలో రైతులు పంట డబ్బులు తీసుకుని వెళ్లే సమయంలో తప్పనిసరిగా రశీదు పెట్టుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులతో మాట్లాడుతూ.. టీ- పోల్ లో రిజర్వేషన్, పోలింగ్ లోకేషన్, పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ వివరాలు అప్ లోడ్ చేయాలని అన్నారు. 63 క్లస్టర్ పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీలలో మొదటి విడత ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల, ఓటరు జాబితా గ్రామంలోని మూడు ప్రాముఖ్య ప్రదేశాలలో అతికించడం, స్థానికంగా పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని అన్నారు. నామినేషన్ స్వీకరణ, పోలింగ్ వివరాలు, ఇతర ఎన్నికల సంబంధించిన వివరాలు ప్రతి మండలం నుంచి అప్ డేట్ చేసే విధంగా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికలకు సంబంధించిన రిపోర్టింగ్ సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు. పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం తప్పనిసరిగా అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలు, బ్యాలెట్ బాక్సులు, ఇతర పోలింగ్ సామాగ్రి మండల స్థాయిలో అందుబాటులో పెట్టాలని అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ సిబ్బంది ,అధికారులు, పోలింగ్ సిబ్బంది, ఉద్యోగులు భాగస్వామ్యం కావద్దని సూచించారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డీపీఓ ఆశాలత, డిఆర్డిఓ సన్యాసయ్య, ఎన్నికల నోడల్ అధికారులు, ఆర్డీఓ నరసింహా రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. అపూర్వ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని.**

**ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలు.**

**నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు.**

**మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ సజావుగా జారీ చేయాలి.**

**పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమిషనర్**



**మహబూబాబాద్, నవంబర్.26(పి.సి.డబ్ల్యూ న్యూస్):**పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు.పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.మహబూబాబాద్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి నుంచి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్,ఎస్పి డాక్టర్ శబరీష్, రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికలను మూడు విడుతలలో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని, డిసెంబర్ 11న మొదటి విడత, డిసెంబర్ 14న రెండవ విడత, డిసెంబర్ 17న మూడవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల సంబంధించి గ్రామానికి నవీకరించిన చేసిన రిజర్వేషన్లు, ఏ విడత పోలింగ్ ఉంటుంది, పోలింగ్ కేంద్రాల జియో లోకేషన్ వివరాలు వెంటనే టి-పోల్ వెబ్ సైట్, యాప్ లో నమోదు చేయాలని అన్నారు. టి-పోల్ వెబ్ సైట్, యాప్ లో వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో నోడల్ అధికారిని నియమించాలని, ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఫిర్యాదులను మూడు రోజులలో పరిష్కరించాలని అన్నారు.నవంబర్ 23న ఫైనల్ చేసిన ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రకారం పంచాయతీ ఎన్నికల నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 2 కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న భవనం దగ్గర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వెబ్ క్యాస్టింగ్ జరిగే పోలింగ్ కేంద్రాల వివరాలు పంపాలని , పోలింగ్ కేంద్రాలలో మంచి వెలుతురు, ఫర్నిచర్, పవర్ సరఫరా వంటి ఏర్పాట్లు చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 27న ఉదయం 10.30 గంటల వరకు విడుదల చేయాలని అన్నారు. నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు పంచాయతీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలని అన్నారు. నవంబర్ 27 నుంచి నవంబర్ 29 వరకు ప్రతిరోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని అన్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధిత రిటర్నింగ్ అధికారులు వద్ద నామినేషన్ దాఖలు చేసేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. నామినేషన్ల పరిశీలన నవంబర్ 30 న సాయంత్రం 5 గంటల వరకు పూర్తి చేసి చెల్లుబాటైన నామినేటెడ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని అన్నారు. అభ్యర్థుల జాబితా పై అప్పీళ్ళ కోసం డిసెంబర్ 01, సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుందని, డిసెంబర్ 2 నాడు ఆపిళ్ళ పరిష్కరించాలని, నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 03 మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంటుందని, అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రచురణ చేయాలని అన్నారు .నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా అవసరమైన మార్గదర్శకాల జిల్లా ఎన్నికల అధికారులు జారీ చేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న ప్రింటర్లకు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార కరపత్రాల ముద్రణ చేయవద్దని ఆదేశాలు జారీ చేయాలని, ఎన్నికల ప్రచారం సంబంధించి అభ్యర్థుల వ్యయ వివరాలను నమోదు చేసేందుకు ధరలను ఖరారు చేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ లకు ఎన్నికల కమిషనర్ సూచించారు. ప్రతి మండలానికి ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, ఒక ఏ.ఈ.ఓ (సహాయ వ్యయ వివరాల నమోదు అధికారి), ప్రతి జిల్లాకు ఒక స్టాటిక్ సర్వేలెన్స్ బృందం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తప్పనిసరిగా జరిగేలా పర్యవేక్షించాలని అన్నారు. **ప్రతి జిల్లాలో ఎం.సి.ఎం.సి కమిటి** జిల్లా మీడియా సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో వినియోగించే ఎలక్ట్రానిక్ వీడియోలకు ముందుగా ఎం.సి.ఎం.సి అనుమతి ఉండాలని అన్నారు. ఎన్నికల దృష్ట్యా తనిఖీలు నిర్వహించే నేపధ్యంలో రైతులు పంట డబ్బులు తీసుకుని వెళ్లే సమయంలో తప్పనిసరిగా రశీదు పెట్టుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు.ఎం.సి.సి అమలులో నిర్వహించే తనిఖీల లో నగదు, బంగారం, ఇతర పరికరాలు సీజ్ చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు అందించాలని, సీజ్ చేసిన పరికరాలకు సంబంధించిన ఆధారాలు సమర్పించేందుకు ఏ అధికారి ముందు హాజరు కావాలని వివరాలు ఆ రసీదు లో ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్.పి.సీ.ఈ.ఓ పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, డి.సి.ఓ వెంకటేశ్వర్లు, డి.ఈ.ఓ దక్షిణా మూర్తి, పిడి హౌసింగ్ హనుమనాయక్, ఆర్టీవో సాయి చరణ్, డి ఎం సివిల్ సప్లై కృష్ణవేణి, కృష్ణవేణి, డివిజన్ పంచాయతీ అధికారి పుల్లారావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్ కుమార్, పర్యవేక్షకులు దామోదర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బెడద అమ్మతమ్మ శంకరయ్య జ్ఞాపకార్థం

**• 24 మంది శాంటేజర్ వర్కర్లకు దుప్పట్లు పంపిణీ**



**కురవి నవంబర్ 26(పి.సి.డబ్ల్యూ న్యూస్):**శానిటేషన్ కార్మికులకు సాయి అమృత చారిటబుల్ ట్రస్ట్ బెడద నారయ్య ఆగయ్య కుటుంబికుల బెడద అమూర్తమ్మ శంకరయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు బెడద కళావతి వీరన్న దంపతులు సహాయంతో కొరవి కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు రాజేందర్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది.మహబూబాబాద్ జిల్లా కురవి మేజర్ గ్రామపంచాయతీ పనిచేసే కార్మికులు శానిటైజర్ వర్కర్లను చలికాలని దృష్టిలో పెట్టుకొని ఇదే గ్రామానికి చెందిన బెడద వీరన్న దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఈస్ట్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టండ్ కార్పొరేటర్ వీరన్న మాట్లాడుతూ... ఉన్న ఊరు కన్నతల్లి తో సమానం ఊరు నుండి 30 సంవత్సరాలు మా కుటుంబం వెళ్ళిపోయినా కానీ ఊరు కోసం ప్రతి సంవత్సరం ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు.ప్రతి సంవత్సరం శివరాత్రి జాతరకు జాగారం చేసే శివ భక్తుల కోసం ఏడు క్వింటాల కందగడ్డ వండించి ఉచితంగా భక్తులకు అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా బెడద నారాయణ మా తాతగారు ఇదే గ్రామ పంచాయతీలో 1971 లో కాంగ్రెస్ పార్టీ రామ సహాయం సురేందర్ రెడ్డి నాయకత్వంలో మా తాత బెడద నారయణ సర్పంచగా ప్రజలకు సేవలందించినారు.నాకు జన్మనిచ్చిన ఊరు కోసం ఏదో ఒక కార్యక్రమం చేయాలని మానవ దృక్పథంతో బుధవారం గ్రామపంచాయతీలో పనిచేసే సిబ్బందిలకు 24 దుప్పట్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. మానవ సేవే మాధవ సేవగా నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.నా కన్న తండ్రి తాత ముత్తాతలకు జన్మనిచ్చిన ఈ గ్రామానికి ఎంత సేవ చేసే భాగ్యం నాకు దొరికినందుకు శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామికి రుణపడి ఉంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో కురవి టౌన్ అధ్యక్షులు నారాయణ రాజేందర్ కుమార్,మండల యూత్ అధ్యక్షులు దడిగల శరత్,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి రజినీకాంత్,సీనియర్ నాయకులు సామాజిక సేవావేత్త బానోత్ లక్ష్మణ్ నాయక్,ఆలయ ధర్మకర్త చిన్నం గణేష్, స్కూల్ మాజీ చైర్మన్ మిరియాల లక్ష్మయ్య,తరాల వీరన్న,బుక్క నాగరాజు,మెకానిక్ కృష్ణమూర్తి,సంగెం నాగరాజు,గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలో చైర్మన్ మువ్వా







**సత్తుపల్లి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో తాళ్లమడ గ్రామం లో వెంపాటి లక్ష్మీనారాయణ,లక్ష్మీ దంపతుల కుమారుని వివాహ వేడుకలో తెలంగాణ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయ్ బాబు పాల్గొని పెండ్లి కుమారుని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణంలో ప్రముఖ నగల వ్యాపారవేత్త అయిన కుసంపూడి శ్రీనివాస రావు ఆహ్వానం మేరకు విచ్చేసి వారి నూతన జ్యూయలరీస్ షాప్ ప్రారంభోత్సవం చేసి,వారి వ్యాపార అభివృద్ధిని ఆకాంక్షించినారు.అదే విధంగా పట్టణం లో కాకర్లపల్లి రోడ్ నందు నివాసం ఉంటున్న డాక్టర్ ఇమ్మడి ప్రసాద్ తండ్రి అయిన ఇమ్మడి రంగారావు ఆరోగ్య రీత్యా పరామర్శించి త్వరగా కోలుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

# పంట పొలాలను నిస్సారం చేయొద్దు

**• పత్తి, వరి కొయ్యలను కాల్చకుండా పంట పొలాల్లోని భూసారాన్ని, వాతావరణాన్ని పరిరక్షించుకుందాం: జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య**





**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పంటపొలాల్లో పత్తి, వరి కొయ్యలను తగులబెట్టి సారవంతమైన భూమిని నిస్సారం చేయొవద్దని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య రైతులకు సూచించారు. ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండలం, చింతగుర్తి, పరికలబోడుతండాలో బుధవారం జిల్లా వ్యవసాయాధికారి సందర్శించారు. ఈ సందర్భంగా అయన రైతులతో మాట్లాడారు. సాగుచేసిన పొలంలో వ్యర్థాలను తగులబెడుతున్న రైతులకు అవగాహన కల్పించారు. ఇలా చేయడం వలన భూమిలో పంటలకు మేలు చేసే బాక్టీరియా నశించిపోతుందని, తద్వారా పంట దిగుబడి తగ్గుతుందని వివరించారు. అనంతరం పత్తి, మిర్చి పంటలను పరిశీలించారు. వర్షాలకు పత్తి దెబ్బతిని పోయిందంటూ రైతులు ఆయనకు ఎకరువు పెట్టారు. మిర్చిపై తక్కువ ఫెస్టిసైడ్స్ వాడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమమంలో ఆయన వెంట ఏఈఓ బాలబత్తుల శిరిణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ నెలలో జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల వారికినామినేషన్ చేయు నిబంధనలు

**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):**డిసెంబర్ నెలలో మూడు విడుదలగా జరగనున్న సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్ల వేసే నామినేషన్ నియమ నిబంధనలు ఇలా ఉన్నాయి. నామినేషన్ వేసే వ్యక్తి 21 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.అభ్యర్థి మరియు ప్రతిపాదకుడు సంతకం చేసిన నామినేషన్ ఉదయం 10.30 నుండి 5 గంటల లోపు సమర్పించాలి.ప్రతిపాదకుడు కచ్చితంగా సంబంధిత వార్డు ఓటర్ లిస్టులో నమోదుఅయి ఉండాలి. అభ్యర్థి ఆ గ్రామంలో ఓటరుగా నమోదు అయి ఉండాలి.అభ్యర్థి మరియు ప్రతిపాదకుడు ఇంటి టాక్స్ కట్టి గ్రామ పంచాయతీ నుండి నో డ్యూ సర్టిఫికెట్ తీసుకోవాలి.డిపాజిట్ రుసుము సర్పంచ్ అభ్యర్థికి 2000 వార్డు అభ్యర్థికి 500 చెల్లించాలి.ఎస్సీ ఎస్టీ , బిసి కుల ధృవీకరణ ఇవ్వాలి లేదంటే నామినేషన్ ఫారం లోని పార్ట్ _|||లో డిప్యూటీ తహసీల్దార్ సంతకం చేయించాలి.రిజర్వుడు కేటగిరి అభ్యర్థుల డిపాజిట్ రుసుము సర్పంచి అభ్యర్థికి 1000 వార్డు అభ్యర్థికి 250. ఇద్దరు సాక్షుల స్వీయ ధృవీకరణ అన్ని గడులు పూరించి ఇవ్వాలి.-రిటర్నింగ్ అధికారి సమక్షం లో ఎన్నికల ఖర్చు ఖాతా నిర్వహిస్తానని చెప్పే డిక్లరేషన్ పై సంతకం చేసి ఇవ్వాలి. అభ్యర్థి తన గుర్తింపు కార్డు కొరకు ఫోటోను సమర్పించాలి.స్క్రూటీని రోజున నిర్ణీత సమయానికి రిటర్నింగ్ ఆఫీసర్ ఎదురుగా హాజరు కావాలి ఇవి వారి నిబంధనలు.

# 15వ పోలీస్ బెటాలియన్‌లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



**సత్తుపల్లి,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల పరిధిలో బి.గంగారం 15 వ పోలీస్ బెటాలియన్ నందు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమాండెంట్ యన్. పెదబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆమోదితమైన రోజు అయిన నవంబర్ 26ను గుర్తుచేసుకుంటూ, రాజ్యాంగ విలువలు,పౌర హక్కులు,బాధ్యతలు, కర్తవ్యాలపై అవగాహన పెంపుతో దేశ భద్రత,శాంతి సమాధానాల పరిరక్షణలో పోలీసు విభాగం పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు.ప్రతిఒక్క సిబ్బంది రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులు కర్తవ్యాలను గౌరవిస్తూ సేవ చేయాలని అందరితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ అంజయ్య ,మినిస్ట్రియల్ స్టాఫ్ ఆర్ఐ లు,ఆర్ ఎస్ ఐ లు బెటాలియన్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు.



**చిట్యాల, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలం చల్లగరిగ చౌరస్తా లో, అంబేద్కర్ ఫేలోషిప్ అవార్డు గ్రహీత నోముల శివశంకర్ , మరియు అంబెడ్కర్ వాదుల వారి ఆధ్వర్యంలో , డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం నోముల శివశంకర్ మాట్లాడుతూ. మన రాజ్యాంగం ద్వారా, పార్లమెంటు, అసెంబ్లీ లు, చేసే చట్టాలు, గాని ప్రభుత్వం తిసుకొని నిర్ణయాలు భారత రాజ్యాంగ నికి, కట్టుబడి ఉండాలన్నా సిద్ధాంతాన్ని , ఏర్పాటు చేసుకున్న రోజే ఈ నవబంర్ 26, రాజ్యాంగాన్ని 1949, లో ఆమోదించబడింది అన్నారు కొల్లూరి అశోక్,దూడ పాక సరోత్తం,జేర్రి పొతుల ఓదయ్య, సిరి పెల్లి జంపయ్య,దూడపాక సురేందర్, నోముల నాగరాజు,దూడపాక మరియమ్మ, గువ్వ యశోద, రామస్వామి, శ్రీనివాసు,నితిన్, రఫీ పాల్గొన్నారు

# వధూవరులను ఆశీర్వదించిన మంత్రి తుమ్మల



**సత్తుపల్లి,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లిలో పట్టణములో రాణి సెలబ్రేషన్స్ లో బుధవారం జరిగిన వివాహ వేడుకలలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.వేంపాటి లక్ష్మీనారాయణ, లక్ష్మి దంపతుల కుమారుడు తరుణ్ చౌదరి వివాహ కార్యక్రమంలో పాల్గొని వారిని ఆశీర్వదించి నిండు నూరేళ్లు కలకాలం చల్లగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు సత్తుపల్లి అశ్వరావుపేట నియోజకవర్గాల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తుమ్మల అభిమానులు స్థానికులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో సండ్ర విస్తృత పర్యటన

**- నూతన వధూవరులకు ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య**





**సత్తుపల్లి,నవంబర్ 26 (పిసీడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లిలో బుధవారం బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య విస్తృత పర్యటన చేపట్టారు. పట్టణంలోని అవని వెంచర్ లో నివాసం ఉంటున్న రాచర్ల మోహన్ రావు, లక్ష్మి దంపతుల కుమారుడు చంద్రశేఖర్, హుషారాణిల వివాహం జరగగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వారి నివాసానికి వెళ్లి వారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరంసత్తుపల్లి మండలం తాల్లమడ గ్రామానికి చెందిన వేంపాటి లక్ష్మీ నారాయణ, లక్ష్మి దంపతుల కుమారుడు తరుణ్ చౌదరి వివాహ వేడుకకు హాజరై ఆశీర్వదించినారు.అదే విధంగా సత్తుపల్లి పట్టణంలో కూసంపూడి శ్రీనివాసరావు నూతనంగా ఏర్పాటు చేసిన సిరి జ్యువెలరీస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామేశ్వరరావు, కూసంపూడి రామారావు, మల్లూరు అంకంరాజు, వల్లభనేని పవన్, పర్వతనేని వేణు, కొప్పుల అప్పారావు,వల్లభనేని పవన్, పర్వతనేని వేణు, మండలపు కిషోర్, బొంతు చంద్రశేఖర్,మేకల నర్సింహారావు,మరికంటి శ్రీను, బెల్లంకొండ రాము పాల్గొన్నారు.

# విద్యార్థుల భోజనాల్లో కాకిరెట్టలు

**మరల భోజనానికి వెళితే లేదని వెళ్ళగొడుతున్నారు?.**

**- అర్ధాకలి తో మాడుతున్నాం అంటున్నారు విద్యార్థులు?.**


**- భోజనశాల ఉన్న తెరుచుకొని పరిస్థితి.**

**- ప్రభుత్వ పాఠశాలలోని పరిస్థితి ఎవరికి చెప్పుకోలేకపోతున్నాం అంటున్నారు?.**





**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇది ఒక పెద్ద పేరున్న ప్రభుత్వ పాఠశాల. ఈ పాఠశాలలో 1975 సంవత్సరంలో పదవ తరగతి ని ప్రారంభించారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు తిరునహరి పాండురంగనాథ స్వామి. ఆ రోజుల్లో పాఠశాల అంటే విద్యార్థులకు ఎంతో భయం క్రమశిక్షణ కు ప్రాధాన్యత ఇచ్చేవారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన వారు ఎంతో ఉన్నత పదవులను పొంది పాఠశాల పేరును నిలబెట్టిన వారు ఎందరో. పాఠశాల ఆఫీసు గదులు భవంతి కావటం,బెంగళూరు పెంకతో నిర్మాణం చేసిన తరగతి గదులు ఉండేవి. ఆనాటి నుండి ఉన్నవే ఇప్పుడున్న ఈ వేప చెట్లు. అప్పటి వసతులు వేరు మధ్యాహ్న భోజనాలు లేవు. పాఠశాల అభివృద్ధి చెందుతున్నప్పటికీ విద్యార్థులకు వసతులు కనుమరుగవుతున్నాయి. పేరున్న ఈ పెద్ద పాఠశాలలో విద్యార్థులు భోజనాలు చేయాలంటే ఈ వేప చెట్లు కిందనే దిక్కు అంటున్నారు విద్యార్థినీ విద్యార్థులు ?. నాయకుల ప్రసంగాలలో ఈ పాఠశాలపై ఎంతో గొప్పగా చెబుతూ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని పేర్కొనటం విశేషం. గత రెండు సంవత్సరాల నుండి భోజనశాలను ఏర్పాటు చేస్తున్న నేటి వరకు కూడా పనులు పూర్తి కాలేదు అంటే అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంటుందో అందరికీ అర్థం అవుతుందన్నారు. బుధవారం పాఠశాల లోని పరిస్థితులు గమనించేందుకు వచ్చిన పి సి డబ్ల్యు న్యూస్ జర్నలిస్ట్ కు కనిపించిన దృశ్యాలివి.పాఠశాల మధ్యాహ్న భోజనం వేప చెట్టు కింద భోజనం చేస్తున్న విద్యార్థులను పలకరించగా వారి మనసులోని ఆవేదనను వెళ్ళబుచ్చారు?. భోజనాల సమయంలో పక్షులు తినే ఆహారంలో రెట్టలు వేస్తున్నాయని ఉపాధ్యాయులకు విషయాన్ని విన్నవించి మరోసారి భోజనానికి వెళితే లేదంటున్నారని చెట్ల కింద భోజనం మాకు అర్ధ ఆకలి మిగులుస్తుందని భోజనశాల ఉన్నప్పటికీ అందులో కూడా భోజనాలు చేయలేని పరిస్థితి నెలకొని ఉందని వారి మనసులోని భావాన్ని వెళ్ళబుచ్చారు?. భోజన సమయంలో భవంతి వరండాలో కూర్చునే ఏర్పాటు చేస్తే మా కీ బాధలు తప్పుతాయని అంటున్నారు. పాఠశాలలో ఉన్న వాష్ రూములు కూడా దుర్గంధ భరితంగా మారాయని పేర్కొన్నారు విద్యార్థిని విద్యార్థులు?. ఈ విషయంపై పాఠశాల ఉపాధ్యాయులను







వివరణ కోరగా ప్రధానోపాధ్యాయులు సెలవులో ఉన్నందున పూర్తి వివరాలను వెల్లడించలేకపోయారు. పాఠశాలలో భోజనశాల ఉన్నప్పటికీ విద్యార్థులు కూర్చొని తినేందుకు వసతులు కల్పించలేదని ఈరోజే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి అయిన తర్వాతనే పాఠశాలకు భవనాన్ని అప్పగించడం జరుగుతుందని గుత్తేదారు తెలిపారని అన్నారు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతం కాదు వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిలో రహదారి పక్కనే మహబూబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాల ఇది. ఇందులో 480 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారని వీరితోపాటు 29 మంది ఉపాధ్యాయులు ఉన్నారని పేర్కొ న్నారు. పదవ తరగతిలో మూడు సెక్షన్లలో కలిసి 120 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారని అన్నారు.ప్రభుత్వ పాఠశాల అంటే నే పట్టింపులు ఎవరికి ఉండవని స్థానికులు పేర్కొనటం విశేషం?.

# షుగర్, బీపీ పరీక్షలు అందరికీ ఉచితమే...

**• బస్టాండ్‌లో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న లైన్స్ క్లబ్ సభ్యులు**




**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని టీజీఎస్ఆర్టిసి బస్టాండ్ లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన లైన్స్ క్లబ్ సభ్యులు. ప్రతినిత్యం ఉదయం 10 గంటలనుండి 2 గంటల వరకు షుగరు, బిపి చెక్ చేస్తామని ఈ అవకాశాన్ని ప్రయాణికులే కాకుండా ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతుడిగా ఉండాలని వారు కోరుతున్నారు. ప్రయాణికులు వారి పరీక్షలను బట్టి ఈ పరీక్షల ద్వారా ప్రయాణం చేసుకునే వీలు కలుగుతుంది. వైద్య పరీక్షలు చేయించుకోండి, సుఖ ప్రయాణాలు కొనసాగించండి.

# అన్ని విద్యా సంస్థలలో రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి

**• మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్ అవార్డ్ గ్రహీత తీగల శ్రీనివాసరావు**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి,నవంబర్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్ అవార్డ్ గ్రహీత, రచయిత, మంచిర్యాల జిల్లాకు చెందిన తీగల శ్రీనివాస్ రావు ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే రాజ్యాంగం ప్రతి భారతీయుడి జీవితంలో భాగమై ఉండాలని, ముఖ్యంగా విద్యార్థులు రాజ్యాంగ విలువలను చిన్న వయస్సులోనే అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.రాజ్యాంగం దేశానికి పునాది, ప్రజల హక్కులకు రక్షణ కవచం, సమానత్వానికి మూలాధారం అని పేర్కొన్న ఆయన దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులు ప్రజాస్వామ్య పరిరక్షకులుగా ఎదగాలంటే ప్రాథమిక పాఠశాలల నుండి విశ్వవిద్యాలయాల వరకు రాజ్యాంగ పఠనం తప్పనిసరి చేయడం అత్యవసరం అని అన్నారు.ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో రాజ్యాంగ విలువలు క్షీణిస్తున్న సందర్భంలో, అపోహలు పెరుగుతున్న తరుణంలో యువతకు రాజ్యాంగం బోధన అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.విద్యార్థులలో విజ్ఞానం, నీతి, పౌర బాధ్యతాభావం పెరగాలంటే రాజ్యాంగంలోని పీఠిక, మౌలిక హక్కులు, మౌలిక కర్తవ్యాలు, దిశానిర్దేశక సూత్రాలను బోధించాల్సిన అవసరం ఉందని తెలిపారు.అంతేకాదువిద్యా వ్యవస్థలో రాజ్యాంగాన్ని చేర్చడం వల్ల విద్యార్థుల్లో సమానత్వం, సామరస్యం, శాంతి, బంధుత్వం వంటి విలువలు పెరుగుతా యని, దేశ నిర్మాణంలో వారు సక్రియ పాత్ర పోషిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్యాంగాన్ని చదువుతున్న కొత్త తరం సామాజిక న్యాయంపై మరింత చైతన్యంతో పనిచేస్తుందని కూడా వివరించారు.రాజ్యాంగ దినోత్సవం రోజున ప్రతి విద్యాసంస్థలో రాజ్యాంగ పఠనం నిర్వహించాలని, వార్షిక కార్యక్రమాలలో రాజ్యాంగ అవగాహనను ప్రధాన అంశంగా చేయాలని ఆయన సూచించారు.విద్యాశాఖ ముందుకు వచ్చి ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి రాజ్యాంగంపై ప్రత్యేక సిలబస్ రూపొందించి అన్ని విద్యాసంస్థల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగం కేవలం ప్రభుత్వ అధికారులకో, న్యాయవాదులకో, రాజకీయ నాయకులకో మాత్రమే సంబంధం ఉన్న గ్రంథం కాదనిబీ దేశంలోని ప్రతి పౌరుడు అర్థం చేసుకోవాల్సిన జీవన పాఠ్యగ్రంథమని తీగల శ్రీనివాస్ రావు పేర్కొన్నారు.భారత రాజ్యాంగం మన దేశ గొప్ప సంపద. యువత దానిని చదవాలి, అర్థం చేసుకోవాలి, గౌరవించాలి. రాజ్యాంగ బోధనే భారత భవిష్యత్తుకు నిజమైన పెట్టుబడి అని ఆయన పునరుద్ఘాటించారు.

# అభివృద్ధి కోసమే ఎన్నికలు

**• పంతాలకు పోయి బంధుత్వాలు పోగొట్టుకోవద్దు**

**• గెలుపు ఓటములు సహజం**





**కల్లూరు, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వాలు గ్రామాభివృద్ధి కోసం సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహిస్తారని అలాంటప్పుడు ఎన్నికల సమయంలో పంతాలకు పోయి శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని, ఎన్నికల ప్రవర్తన నియమావళి పై ఎస్సై డి హరిత అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. బుధవారం మండల పరిధిలోని యర్రబోయినపల్లి,లింగాల పేరువంచ గ్రామపంచాయతీ నందు ఓటర్లకు, గ్రామస్తులకు,సర్పంచ్ అభ్యర్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహజంగా గ్రామస్థాయిలోని పోటీకి సిద్ధమయ్యే అభ్యర్థులు బంధువులై ఉంటారని పంతాలకు పోయి బంధుత్వాలను పోగొట్టుకోవద్దని సూచించారు. ఎన్నికల నాలుగు రోజుల తంతు కోసం తరతరాల నుండి వస్తున్న బంధాలను వదిలేసి శత్రుత్వాలను పెంచుకోవద్దని అన్నారు. ఎన్నికల అనంతరం అందరూ కలిసిమెలిసి సోదర భావంతో తిరగాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికలను అడ్డుపెట్టుకొని అవాంఛనీయ సంఘటనలకు పాల్పడడం శాంతి భద్రతలకు భంగం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. ఒక్కసారి కేసు నమోదు అయితే జీవితంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎన్నో ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తుందని సూచించారు. గెలుపు ఓటములు సహజమని వాటిని ప్రజా తీర్పుగా స్వీకరించి ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్,బిఆర్ఎస్, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దద్దరిల్లిన సింగరేణి

**• సత్తుపల్లి జి.ఎం కార్యాలయం ముందు ధర్నా**







**సత్తుపల్లి,నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సత్తుపల్లి పట్టణంలో కార్మిక భద్రతా చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చిన కేంద్ర నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు జే.ఏ.సీ ఐక్య కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించారు.కార్మికుల హక్కులను రక్షించేందుకు రూపుదిద్దుకున్న అనేక కార్మిక చట్టాలను చెల్లాచెదురుగా చేసి , వాటిని నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వాటి అమలును వెంటనే రద్దు చేయాలని జే.ఏ.సి ఆధ్వర్యంలో ఐఎన్టీయూసీ డిమాండ్ చేస్తూ సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ముందు జే.ఏ.సీ కార్మిక సంఘాల నాయకులు,ఉద్యోగుల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా రద్దు చేయాలని ఆందోళన కార్యక్రమం నిర్వహించి జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు.సత్తుపల్లి కార్మిక నాయకులు మాట్లాడుతూ కార్మికులను తక్కువ జీతాలతో, హక్కులు లేని వాతావరణంలో కట్టుబానిస కార్మికులుగా మార్చేందుకు కార్పొరేట్ ప్రోత్సాహంతో కేంద్ర ప్రభుత్వం 29 కార్మికుల భద్రత చట్టాలను మార్చిందని తీవ్రంగా విమర్శించారు. నాలుగు కోడ్స్‌లో ఉన్న మార్పులు కార్మిక భద్రత, జీతభత్యాలు,కార్మిక హక్కులు,యూనియన్ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు.దేశ నిర్మాణంలో కీలకమైన కార్మిక వర్గాన్ని బలహీనపరచే ఈ నిర్ణయం వెంటనే రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఐఎన్టియుసి బ్రాంచ్ సెక్రెటరీ తీగల క్రాంతికుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్,సిఐటియు ప్రతినిధి కార్తీక్, ఐఎన్టీయూసీ నాయకులు నాగ ప్రకాష్ ,బాలాజీ , నాగేశ్వరరావు,కోటి , ఏఐటీయూసీ నాయకులు భరణి,నరసింహారావు, ప్రసాద్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి



**చిట్యాల, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగంధర్ ఆధ్వర్యంలో 76వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మండల అధ్యక్షుడు జన్నే యుగంధర్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం బడుగు బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కులాలకు ఆశాజ్యోతి భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ గారు రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య అంబేద్కర్ సీనియర్ నాయకులు దొడ్డి కిష్టయ్య ధబ్బేట రమేష్ లు అన్నారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రత్న బాబాసాహెబ్ అంబేద్కర్ గారు సామాజిక న్యాయం సమానత్వం సౌభ్రాతృత్వం వంటి విలువలకు పెద్దపీట వేస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల మాజీ అధ్యక్షులు సరిగోమ్ముల రాజేందర్ ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్ వర్ధమాన గేయ రచయిత దాసరపు నరేష్ సంఘ నాయకులు అంబేద్కర్ వాదులు గౌరిగింట్ల కిరణ్ పాముకుంట్ల చందర్ గడ్డం సదానందం ఏకు కిషన్ పర్లపల్లి కుమార్ రమేషు రాజమౌళి ప్రసాద్ వేల్పుల రాజ్ కుమార్ సాంబయ్య శీల పాక ప్రణీత్ పుల్ల సమ్మయ్య కట్కూరి రాజేందర్ పాల్గొన్నారు.

# ఏన్కూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన కల్లూరు ఏసిపి

**కల్లూరు, నవంబర్ 26 (పిసీడబ్ల్యూ న్యూస్) :** ఏన్కూర్ పోలీస్ స్టేషన్ ను కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్‌సందర్శించారు. ఇటీవల కల్లూరు ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన నూతన ఏసిపి బుధవారం పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, సిసిటిఎన్ఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధిం చి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్ షీట్‌లు, పెండింగ్ కేసులు పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నా రు. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సెక్టా ర్ ఆఫీసర్ల భాధ్యతలు విధిగా అమలు చేయాలని సూచించారు.



# పంచాయతీ ఎన్నికల్లో ఎస్సి, ఎస్టీ, బీసీలకు మద్దతు

- జనరల్ స్థానాల్లో పోటీ బీసీలకు సహకారం
- కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు విశ్వనాథ్ గౌడ్




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే ఎస్సి, ఎస్టీ, బీసీ , మైనార్టీ అభ్యర్థులకు తాము మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు విశ్వనాథ గౌడ్ తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయకుండా బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గతంలో 22 శాతం రిజర్వేషన్ ఉండేదని...ఇప్పుడు 17 శాతానికి పరిమితం చేశారన్నారు. దీనిని 42 శాతానికి పెంచాలన్నారు...ప్రభుత్వం 42 జీవో ద్వారా బీసీ లకు 22 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని, వాస్తవానికి 11.7 శాతం అమలైందని అన్నారు. ఖమ్మం జిల్లాలో రఘునాధపాలెం, తిరుమలాయపాలెం మండలాల్లో ఒక్క పంచాయతీ నీ బీసీ లకు కేటాయించకుండా అన్యాయం చేశారన్నారు. ఈడబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ ఎవ్వరూ అడగలేదని, దీనిపై ఎవ్వరూ కోర్టుకు వెళ్లలేదని అయినా అమలు చేస్తున్నారని అన్నారు. తమ పోరాటం రాజకీయ పార్టీలపై కాదని, కమ్మ, రెడ్లు, వెలమ సామాజిక వర్గాలపై ఉంటుందని అన్నారు. యువతకు, ఆశావహులకు స్వాగతం పలుకుతున్నామని, తమ పార్టీలో చేరాలని కోరుతున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ ప్రజాపతి, ఉమ్మడి జిలా సోషల్ మీడియా కన్వీనర్ సాయి చరణ్ పటేల్, టౌన్ నాయకులు కుసుమ శ్రీనివాస్ నేత తదితరులు పాల్గొన్నారు

# 3 విడతల్లో పంచాయతీ ఎన్నికలు

**ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు**

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**పంచాయతీ ఎన్నికల నిర్వహణపై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా పరిధిలో 566 గ్రామ పంచాయతీ సర్పంచ్, 566 ఉప సర్పంచ్, 5168 వార్డు సభ్యుల ఎన్నిక 3 విడతల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడత డిసెంబర్ 11న 7 మండలాల్లోని 192 గ్రామాలు, 1740 వార్డులకు, రెండవ విడత డిసెంబర్ 14న 6 మండలాల్లోని 183 గ్రామాలు, 1686 వార్డులకు, మూడవ విడత డిసెంబర్ 17న 7 మండలాల్లోని 191 గ్రామాలు, 1742 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పోలింగ్, కౌంటింగ్ ఒకే రోజు జరుగుతాయని, ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత అక్కడే కౌంటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మొదటి విడత పంచాయతీలకు నవంబర్ 27న, రెండవ విడత పంచాయతీలకు నవంబర్ 30న, మూడవ విడత పంచాయతీలకు డిసెంబర్ 3న నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి 3 రోజుల పాటు నామినేషన్లకు, తర్వాతి రోజు నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన నామినేషన్ల ప్రకటన ఉంటుందని, మరుసటి రోజు అప్పీళ్లను స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని అన్నారు. నామినేషన్ల ఉపసంహరణ మొదటి విడత పంచాయతీలకు డిసెంబర్ 3, రెండవ విడత పంచాయతీలకు డిసెంబర్ 6, మూడవ విడత పంచాయతీలకు డిసెంబర్ 9 మధ్యాహ్నం మూడు గంటల వరకు సమయం ఉంటుందని, అదే రోజున పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని గ్రామ పంచాయతీలు, వార్డుల రిజర్వేషన్ ఖరారు చేసామని అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి కోసం 166 ఎస్టి (మహిళలు 75, జనరల్ 91), 110 ఎస్సీ (మహిళలు 48, జనరల్ 62), 54 బీసి (మహిళలు 24, జనరల్ 30), 236 అన్ రిజర్వ్ క్యాటగిరి (మహిళలు 112, జనరల్ 124) లుగా రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని అన్నారు. ఖమ్మం జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 7 లక్షల 95 వేల 138 మంది ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకుంటా రని, 708 పోలింగ్ లొకేషన్ లలో 5168 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, సర్పంచ్ ఎన్నికలకు 9 లక్షల 51 వేలు, వార్డు సభ్యుల ఎన్నికలకు 9 లక్షల 51 వేల బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేశామని, 4894 జంబో, 852 మీడియం బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 566 రిటర్నింగ్ అధికారులు, 3442 పోలింగ్ అధికారులు, 4217 ఇతర పోలింగ్ అధికారులు, 15 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు,15 స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలు, 76 జోనల్ అధికారులు, 25 టిఓటీ, 241 రూట్ అధికారులు నియమించామని, 20 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లు, 191 రిసెప్షన్ కేంద్రాలను, 566 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలలో గుర్తించిన 1858 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ కు ఏర్పాట్లు చేశామని, 648 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదు నమోదు చేయాలనుకునే వారు 1077 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు ఎంసిసి కోడ్ అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రచార ఖర్చులను నమోదు చేసేందుకు ధరల లిస్టు సిద్ధం చేశామని అన్నారు. ఎన్నికల ప్రచారంలో వీడియోలు వినియోగించాలంటే ముందుగా ఎం.సి.ఎం.సి. అనుమతి తీసుకోవాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, జర్నలిస్టులు, వివిధ వర్గాల ప్రజలు తమ సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పారదర్శకంగా సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాలి

- ఆర్టిఐ కమీషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి
- కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టం అప్పీల్స్ పరిశీలించిన ఆర్టిఐ కమీషనర్






**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని ఆర్టిఐ కమీషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. కలెక్టరేట్ లో ఆర్టిఐ కమీషనర్, బుధవారం సమాచార హక్కు చట్టం దరఖాస్తులపై వచ్చిన అప్పిల్లను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ లో వివిధ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిఐ కమీషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి మాట్లాడుతూ.. గత 2 సంవత్సరాల పాటు ఆర్టిఐ కమీషనర్ నియామకం కాకపోవడంతో చాలా కేసులు పెండింగ్ ఉన్నాయని అన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కారం చేయాలనే ఉద్దేశ్యంతో జిల్లాల పర్యటన చేపట్టామని అన్నారు. ఆర్టిఐ చట్టంపై జిల్లా అధికారులకు అవగాహన కల్పించామని అన్నారు. అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఎవరికి భయపడాల్సిన అవసరం లేకుండా ప్రజలు కోరిన సమాచారం నిర్ణీత సమయంలో అందించాలని అన్నారు. ఆర్టిఐ చట్టం ప్రకారం అవగాహనతో అమలు చేస్తే అక్రమాలు తగ్గిపోతాయని అన్నారు. సామాన్యుడు చేతిలో వజ్రాయుధం ఆర్టిఐ చట్టం అని అన్నారు. జిల్లా అధికారులు సమాచార హక్కు చట్టాన్ని తప్పనిసరిగా పాటిస్తూ పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి శాఖ తమకు వచ్చిన సమాచార హక్కు చట్టం దరఖాస్తులను సకాలంలో డిస్పోజ్ చేయాలని అన్నారు. ప్రతి అధికారి తమ శాఖ పరిధిలో సమాచార హక్కు చట్టం దరఖాస్తుల వివరాలతో కూడిన రిజిస్టర్ మెయింటైన్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకులం ఉపాధ్యాయుడిని విధుల నుంచి తప్పించిన సెక్రటరీ షఫీఉల్లా...

**- విద్యార్థిని చేయి విరగొట్టిన యుటిఎఫ్ టేప్రీస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వొల్లాల శ్రీనివాస్ సస్పెండ్**



**కరీంనగర్ రూరల్,నవంబర్26(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ విట్స్ కళాశాల కాంప్లెక్స్ లో నిర్వహించబడుతున్న ప్రభుత్వ మైనారిటీ గురుకుల కళాశాల–1 సీవోఈలో పిజిటి ఇంగ్లీష్ –1 గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వొల్లాల శ్రీనివాస్ ను, విధుల నుంచి సస్పెండ్ చేస్తూ బుధవారం మైనారిటీ గురుకులాల సెక్రటరీ బి.షఫీఉల్లా ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉపాధ్యాయుడు విచక్షణ కోల్పోయి ఇష్టానుసారంగా కొట్టడంతో ఇదే కళాశాలలో పదవ తరగతి చదువుతున్న పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని ఒక తండాకు చెందిన బదావత్ సంజయ్ అనే విద్యార్థి చేయి విరగడంతో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్లో విద్యార్థి సంజయ్ తండ్రితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే రోజు ఉపాధ్యాయుడు వొల్లాల శ్రీనివాస్ ముగ్గురు విద్యార్థులను కొట్టగా అందులో ఇద్దరు బీసీ విద్యార్థులు ఉండగా ఒకరు ఎస్టీ విద్యార్థి కావాలని ఎస్టీ అనే సాకుతో నన్ను ఎక్కువగా వేధించి వొల్లాల శ్రీనివాస అనే ఉపాధ్యాయుడు కొట్టాడని పోలీసులకు లిఖితపూర్వకంగా విద్యార్థి సంజయ్ అతని తండ్రి ఫిర్యాదు చేయగా వొల్లాల శ్రీనివాస్ పై ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కరీంనగర్ రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి కేసు నమోదు చేశారు. నేను యుటీఎఫ్ టేప్రీస్ విభాగానికి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడినని విర్రవీగుతూ, తోటి ఉపాధ్యాయులతో గొడవలు పడటం, సిబ్బందితో వాగ్వివాదానికి దిగటం అలవాటుగా మారింది. ఉన్నత స్థానంలో ఉన్నాననే సోయి మరిచిపోయి ఒకరితో మరొకరికి తగులాటలు పెట్టించడం, నోటి దురుసును ప్రయోగించడం, విద్యార్థులను ఇష్టానుసారంగా కొట్టడం వంటి ఫిర్యాదులు సదరు ఉపాధ్యాయుడిపై విజిలెన్స్ విచారణ రిపోర్ట్ లో హెడ్ ఆఫీస్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. దీనితో ఈఅంశాన్ని సీరియస్ గా తీసుకున్న మైనారిటీ గురుకులాల సెక్రటరీ షఫీ ఉల్లా క్రమశిక్షణ చర్యల కింద ఉల్లాల శ్రీనివాసు ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

# డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు వీరలక్ష్మికి డాక్టరేట్

**అభినందించిన గురుకుల డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సునీత**



**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకురాలు వడ్డెబోయిన వీరలక్ష్మికి ఉస్మానియా యూనివర్సిటీలో రసాయనశాస్త్ర విభాగంలో "వేపర్ ఫేస్ సైమల్టేనియస్ హైడ్రోజనేషన్ అండ్ డిహైడ్రోజేనేషన్ ఓవర్ కాపర్ బేస్డ్ కాటలిస్ట్స్" అనే అంశంపై ప్రొఫెసర్ కె.భాస్కర్ పర్యవేక్షణలో పీహెచ్డీ పూర్తిచేసి డాక్టరేట్ పట్టాను సాధించారు. బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సునీత డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందనసభలో డాక్టరేట్ సాధించిన వీరలక్ష్మిని ఆమె అభినందించారు. ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విద్యార్థినీ, విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవ పంచాయతీలకు రూ.20 లక్షల నజరానా

- ఏకగ్రీవాలపై దృష్టి సారించండి...
- కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి పిలుపు...



**తిమ్మాపూర్,నవంబర్25(పీసీడబ్ల్యూ న్యూస్):** వచ్చే నెల రెండో విడుతలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పంచాయతీల అభివృద్ధికి రూ.20 లక్షలు ప్రోత్సాహంగా అందజేస్తానని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రకటించారు. బుధవారం ఎల్ఎండీ కాలనీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షతవహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలపైననే దృష్టి సారించాలని ఆయన కోరారు. ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తానని, ఆ నిధులతో ఆయా గ్రామాలకు అవసరమైన పనులు చేపట్టవచ్చన్నారు.మెజార్టీ సంఖ్యలో సర్పంచులుగా గెలిపించుకోవడం ద్వారా పంచాయతీలపై పట్టు సాధించాలన్నారు. పంచాయతీ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని, సర్పంచులుగా మనవారిని గెలిపించుకోవడానికి అందరూ కష్టపడి పని చేయాలన్నారు. ఎన్నికలంటేనే ప్రత్యర్థులతో పోటపడటమని, అలాంటప్పుడు గెలుపు అవకాశాలు ఉన్నవారిని మాత్రమే పోటీకి నిలపాలే తప్ప అందరూ పోటీపడకూడదన్నారు. ఎన్నికల సమీపంలో ఉన్నందున పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో ఏమాత్రం జాప్యం జరగొద్దని, అందరి సమన్వయంతో అభ్యర్థుల జాబితా ఖరారు చేయాలని ఎమ్మెల్యే కోరారు.ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు, శంకపట్నం మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటకుంటే ప్రతిపక్షాల ముందు పలచనవుతామన్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపు మనందరి లక్ష్యం కావాలన్నారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో వివాదాలకు తావివ్వొద్దన్నారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధగోని లక్ష్మినారాణ గౌడ్, ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షులు గోపగోని బస్వయ్య గౌడ్, నందగిరి రవీంద్రచారి, బండారి రమేశ్,ముక్కిస రత్నాకర్ రావు,కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, బి.రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీలు ఊట్కూరి వెంకట రమణారెడ్డి,గుడిసె అయిలయ్య యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, పార్టీ నాయకులు ఉప్పుగళ్ల మల్లారెడ్డి, బండారి తిరుపతి, గట్టు తిరుపతి, చింతిరెడ్డి పద్మ, మొలంగూరి సదానందం, నేరెళ్ల సంతోష్,ఎగ్గని రమేశ్, రాయిని రమేశ్, గాజుల శ్రీనివాస్, మహేశ్, పవన్ కుమార్, జంపయ్య,దశరథం తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల డిగ్రీ కళాశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థినులు, కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు అందరూ కలిసి బుధవారం జాతీయ రాజ్యాంగ దినోత్సవంను ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అందరు ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సునీత మాట్లాడుతూ.. 1949 నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదం జరిగింది. భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించింది. ఇది దేశ నిర్మాణానికి అత్యంత కీలకమైన రోజు అన్నారు. రాజ్యాంగ రూపకర్త డా. బి.ఆర్. అంబేద్కర్ సేవలను ఈ సందర్భంగా స్మరించారు. సమానత్వం, స్వాతంత్ర్యం, న్యాయం, సోదరభావం వంటి ప్రజాస్వామ్య మూల్యాలను కాపాడటంలో ప్రతి పౌరుడూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.పాఠశాలలు, కళాశాలల్లో రాజ్యాంగ ప్రమాణ స్వీకారం, సెమినార్లు, ర్యాలీలు నిర్వహించడం, యువతలో రాజ్యాంగ ప్రాముఖ్యతను తెలియజేయాలి.దేశ నిర్మాణానికి పునాది అయిన రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ప్రజాస్వామ్య బలపాటుకు ఈ దినోత్సవం స్ఫూర్తినిస్తున్నదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వమే భారత రాజ్యాంగం

**● తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపల్ డాక్టర్ టి రాములు ● గురుకులంలో ఘనంగా 76వ రాజ్యాంగ దినోత్సవం**









**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కొన్ని వందల సంవత్సరాల చరిత్ర కలిగిన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సంక్షేమ రాజ్య తత్వం, సమానత్వాన్ని మరింత పటిష్టం చేసేలా భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎంతో నిష్ఠతో రూపొందించారని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల ముదిగొండ ప్రిన్సిపల్ డాక్టర్ టి రాములు అన్నారు. ఖమ్మం జిల్లా మధిర కిష్టాపురంలో గల కళాశాల ఆవరణలో గురువారం సోషల్ డిపార్ట్మెంట్ ఘనంగా నిర్వహించిన 76వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ముందుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవీయతను పరిపూర్ణంగా నలుదిక్కుల ప్రసరించేలా ఉన్నతమైన ఆశయంతో భారత రాజ్యాంగం రూపొందించిన అంబేద్కర్ దూరదృష్టిని తెలుసుకోవాలన్నారు. 75 సంవత్సరాలుగా చెక్కుచెదరని సౌభాతృత్వం,సమానత్వం,సంక్షేమ రాజ్యతత్వం అంతర్లీనంగా ప్రబోదించే రాజ్యాంగాన్ని ఈ దేశ పౌరులకు అందించిన అత్యంత పవిత్రమైన, ఉత్కృష్టమైన దిక్సూచి అన్నారు. అందుకే ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలతో పాటు భారత రాజ్యాంగాన్ని అధ్యయనం చేయాలన్నారు. గ్రంథాలయంలో రాజ్యాంగ ప్రతులను లోతుగా అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. అంతేకాదు భారత రాజ్యాంగం న్యాయ సూత్రాలను, కార్యనిర్వాహక పటిష్టతను మరింత ముందుకు తీసుకుపోయే గొప్ప ఆలోచనలను ప్రేరేపిస్తుందన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ ఐనాల సైదులు '75 ఏళ్ల భారత రాజ్యాంగం– భారతీయ స్ఫూర్తి' అనే అంశంపై మాట్లాడారు. అత్యుత్తమ క్రమశిక్షణ న్యాయం ధర్మం ప్రబోధిస్తూ భారత పౌరులను స్వేచ్ఛ సమానత్వం వైపుకు నడిపించే శోధక శక్తి భారత రాజ్యాంగం అని తెలిపారు. ప్రతి ఒక్కరు అత్యంత పవిత్రమైన మనసుతో పఠించి దాని సారాన్ని అర్థం చేసుకొని దానికి అనుగుణంగా నడుచుకోవడమే నిజమైన భారతీయత అని ఈ సందర్భంగా ఉద్బోధించారు. రాజ్యాంగానికి ఆత్మలాంటి 'ప్రవేశిక' (ప్రియాంబుల్) ను విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సోషల్ డిపార్ట్మెంట్ బుచ్చయ్య, అనిల్, సీనియర్ అధ్యాపక ఉపాధ్యాయులు సత్యం,సుధాకర్, రామయ్య, లింగాల నరేష్, బొక్క నాగేశ్వరరావు, పి వి. అంజయ్య, సాంసన్, కృష్ణమూర్తి, లాల్ సైదులు, శరత్ , తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య ఐక్యతను చాటి ఛాంబర్ అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

**భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, కొప్పు నరేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి సీతారామచంద్రరావు**


**ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం**





**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆర్యవైశ్య ఐక్యతను చాటి ఛాంబర్ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని, ఎన్నికల్లోనే పోటీ తత్వం ఆ తర్వాత అందరూ సమానులే అని భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, కొప్పు నరేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి సీతారామచంద్రరావులు అన్నారు. ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుమ్మడవెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ 25 – 28 కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కురువెల్ల ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సోమ నరేష్, కోశాధికారి తల్లాడ రమేష్, సెంట్రల్ ఈసీ మెంబర్స్ రాయపూడి రవికుమార్, వంగవీటి హరీష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అనుబంధశాఖల నుండి ఎన్నికైన ఆర్యవైశ్య అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి, ఈసీ మెంబర్స్ లకు ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘ పాలకవర్గం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు మాట్లాడుతూ... ఛాంబర్ లో గెలిచిన ఆర్యవైశ్య నాయకులందరూ మన ఐక్యతను చాటి ఛాంబర్ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో పోటీతత్వం సహజమే అని అది ఎన్నికవరకే ఉండాలని ఎన్నికైన మరు నిమిషం నుంచి అంతా ఒకటేలా ఉంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, కొప్పు నరేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి సీతారామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి గోళ్ల రాధాకృష్ణమూర్తి, వాసవి క్లబ్ గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు, పసుమర్తి లక్ష్మణరావు, పసుమర్తి సాంబశివరావు, డోకుపర్తి రవీందర్, విన్నమూరి వెంకట సుబ్బారావు, కొదుమూరి జగన్నాథం గుప్తా, పబ్బతి ప్రదీప్ కుమార్, కొంకిమళ్ళ మృత్యుంజయరావు, కుమ్మరకుంట్ల శ్రీనివాసరావు, రాయపూడి బలరామమూర్తి, మానేపల్లి నగేష్, వెంపటి జగదీశ్, ఆర్యవైశ్య ప్రముఖులు కురువెల్ల రామారావు, పాల్వాయి సీతయ్య, పాల్వాయి వెంకటేశ్వర్లు, పసుమర్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వెంకట నరసింహారావు, తేలుకుంట్ల ఓంకార్, ప్రతాపని గంగాధర్, కందిబండ వేణుగోపాల్, కురువెల్ల గోపాలకృష్ణమూర్తి, బిక్కుమల్ల ప్రదీప్, ఇనుగుర్తి నాగరాజు, సోమా రవీందర్, కొల్లా రామారావు తదితరులు, నగర పాలకవర్గం కార్యవర్గం అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో హడావిడి




**వ్యూహాలు పన్నుతున్న ప్రధాన పార్టీ నేతలు**

**నిజామాబాద్,నవంబర్26:** ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో హడావిడి మొదలయ్యింది. ప్రధాన ప్రతిపక్షం ఇందుకు వ్యూహాలు పన్నుతోంది. అలాగే అధికార కాంగ్రెస్ పట్టుకోసం ప్రయత్నిస్తోంది. బిజెపి కూడా తన పట్టును నిలుపుకునేందుకు సిద్దంగా ఉంది. మంత్రి వేముల ప్రశాంత రెడ్డి ఇప్పటికే కార్యక్షేత్రంలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ప్రభుత్వ సలహాదరు సుదర్శన్ రెడ్డి, మరో సలహాదరు షబ్బీర్ అలీలకు ఇద పరీక్ష. ఇక బిజెపి ఎంపి అరవింద్ కూడా తమ పార్టీ కోసం ఎమ్మెల్యేలను కలుపుకుని ముందుకు సాగనున్నారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ నిర్వహించ నుండడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. గంట విరామం తర్వాత మధ్యాహ్నా 2గంటల నుంచి కౌంటింగ్ పక్రియ షురూ అవుతుంది. గతంలోనే ఓ మారు నోటిఫికేషన్ రావడంతో అప్పటికే అధికారులు సిద్దంగా ఉన్నారు. ఇప్పుడు అదే విధానంతో ముందుకు సాగనున్నారు. నిజామాబాద్ జిల్లాలో 545 పంచాయితీలు, 5022 వార్డులు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో 532పంచాయితీలు, 4656 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. తొలి విడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం బుదవారం మొదలు అయ్యింది. రెండో విడత నవంబర్ 30న, 3వ విడత నామినేషన్ల పర్వం డిసెంబర్ 3న ప్రారంభం కానుంది. తొలి విడతకు, రెండో విడతకు మధ్య రెండు రోజుల సమయం ఉంటుంది. రెండో విడతకు మూడో విడతకు మధ్య కూడా రెండు రోజుల సమయాన్ని ఇచ్చింది. నామినేషన్ల పక్రియ ప్రారంభం నుంచి పోలింగ్, కౌంటింగ్ ముగింపునకు మధ్య 14 రోజుల సమయాన్ని ఎన్నికల సంఘం ఇచ్చింది. నిజామాబాద్ జిల్లాలో మొత్తం మూడు రెవెన్యూ డివిజన్లు ఉండగా మూడు విడతల్లో ఒక్కో విడుత ఎన్నికల్లో చేర్చారు. మొదటి విడుతలో బోధన్ డివిజన్ పరిధిలో బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పొతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, నవీపేట మండలాలున్నాయి. రెండో విడతలో నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ధర్పల్లి, డిచ్పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, మోపాల్, నిజామాబాద్ రూరల్, సిరికొండ, జక్రాన్పల్లి మండలాలు పేర్కొన్నారు. మూడో విడుతలో ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆర్మూర్, ఆలూర్, బాల్కొండ, భీంగల్, డొంకేశ్వర్, కమ్మర్పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట, వేల్పూర్, ఏర్గట్ల మండలాలున్నాయి. కామారెడ్డి జిల్లాలో మొత్తం మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఇందులో మొదటి విడుతలో కామారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలోని భిక్కనూర్, బీబీపేట, దోమకొండ, కామారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచ, రాజంపేట, రామారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి మండలాలకు పోలిం గ్ ఉంటుంది. రెండో విడుతలో బాన్సువాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని లింగంపేట, నాగిరెడ్డిపేట, గాం ధారి, ఎల్లారెడ్డి, మహ్మద్నగర్, నిజాంసాగర్, పిట్లం మండలాలకు ఎన్నికలు ఉంటాయి. మూడో విడుతలో ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలోని బాన్సువాడ, బిచ్కుంద, బీర్కూర్, డోంగ్లి, జుక్కల్, మద్నూర్, నస్రుల్లాబాద్, పెద్దకొడప్గల్ మండలాలు ఉన్నాయి.

# రాంచంద్రాపూర్, కుర్మపల్లి గ్రామాల్లో ఎన్నికలు నిలిపివేత



**కోర్టు ఉత్తర్వుల మేరకు ఎన్నికల సంఘం ఆదేశాలు**

**మిగతా గ్రామాల్లో మొదలైన సర్పంచ్ హడావిడి**

**కరీంనగర్,నవంబర్26:** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాంచంద్రాపూర్, కుర్మపల్లి గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు నిలిపివేస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. రాంచంద్రాపూర్కు అనుబంధంగా ఉన్న కుర్మపల్లి కొత్త పంచాయతీగా ఏర్పాటు కాగా, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని రాంచంద్రాపూర్ గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎన్నికల సంఘం ఈ రెండు గ్రామాల్లో ఎన్నికలు నిలిపివేసింది. జిల్లాల వారీగా మూడు విడుతల్లో జరిగే మండలాలు కరీంనగర్ జిల్లాలో మొదటి విడుత గంగాధర, రామడుగు, చొప్పదండి, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ ఉన్నాయి. రెండో విడుతలో చిగురుమామిడి, తిమ్మాపూర్, గన్నేరువరం, మానకొండూర్, శంకరపట్నం,మూడో విడుత వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట, హుస్నాబాద్, సైదాపూర్(వీ) ఉన్నాయి. ఇక జగిత్యాల జిల్లాలో ÷రిదటి విడుత మేడిపల్లి, భీమారం, కథలాపూర్, కోరుట్ల, మెట్పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఉన్నాయి. రెండో విడుతలో జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, సారంగాపూర్, రాయికల్, బీర్పూర్, మల్యాల, కొడిమ్యాల ఉన్నాయి. మూడో విడుతలో ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి, పెగడపల్లి ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో మొదటి విడుత మంథని, ముత్తారం, రామగిరి, కమాన్పూర్, కాల్వశ్రీరాంపూర్ ఉన్నాయి. రెండో విడుతలో పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం, జూలపల్లి,మూడో విడుతలో సుల్తానాబాద్, ఎలిగేడు, పెద్దపల్లి, ఓదెల ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి విడతలో రుద్రంగి, వేములవాడ రూరల్, వేములవాడ, కోనరావుపేట,చందుర్తి, రెండో విడతలో బోయినపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, మూడో విడుత గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో అభ్యర్థుల సందడి మొదలయ్యింది. బుధవారం నామినేషన్లు మొదలు కావడంతో తొలిదశ గ్రామాల్లో హడావిడి కనిపించింది.